శ్రీః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీమద్వరవరమునయే నమః

# శ్రీభాష్య మఙ్గళశ్లోకవివరణము.

*అఖిలభువనజన్మ స్థేమభఙ్గాదిలీలే వినతవివిధభూతవ్రాతరక్షైకదీక్షే।*
*శ్రుతిశిరసివిదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా॥*

అన్నది శ్రీభాష్యమంగళశ్లోకం. దీనికి శ్రుతప్రకాశికాచార్యులవారు సాయించిన వివరణాన్ననుసరించి కొన్ని అర్థవిశేషాలని ఇప్పుడు మనం అనుభవించే ప్రయత్నం చేద్దాం.

*"అఖిల-భువన-జన్మ-స్థేమ-భఙ్గ-ఆది-లీలే"* - సమస్తలోకాల ఉత్పత్తి, స్థితి, లయం, (ఆదిశబ్దంవల్ల) వీటికి యోగ్యమైన అంతఃప్రవేశం, నియమనం, వీటినిలీలగా గలిగినవాడై, *"వినతవివిధభూతవ్రాతరక్షైకదీక్షే"* - అనేకరకాలైన భూతములు- అంటే బ్రహ్మజ్ఞానమనే సత్తగలవారై ఎన్నోరకాలైన మార్గాల్లో (భక్తులుగానూ, ప్రపన్నులుగానూ ఉండి) సర్వేశ్వరుడికి నమస్కరించే బ్రహ్మజ్ఞానులనీ, వారితో సంబంధంగలవారినీ రక్షించడమే దీక్ష(వ్రతం)గాగలగాడై, *"శ్రుతిశిరసి విదీప్తే"* - వేదాంతంలో బాగా ప్రకాశిస్తూ ఉన్నవాడైన *"పరస్మిన్ బ్రహ్మణి శ్రీనివాసే"* - శ్రీనివాసుడనే పరబ్రహ్మవిషయంలో, *"భక్తిరూపా శేముషీ మమ భవతు"* - భక్తిరూపాపన్న జ్ఞానం నాకు కలుగుగాక.

పరమాచార్యులైన శ్రీఆళవన్దార్ మనోరథాన్ని అనుసరించి బ్రహ్మసూత్రప్రబంధానికి వ్యాఖ్యానమైన శ్రీభాష్యాన్ని సాయించప్రారంభించిన శ్రీమద్రామానుజులవారు మొట్టమొదట ఇష్టదేవతాప్రార్థనమైన మంగళశ్లోకాన్ని సాయిస్తున్నారు. ప్రారంభించిన ఈవ్యాఖ్యానగ్రంథం 1. విఘ్నాలులేకుండా పరిసమాప్తి అవడానికీ, 2. వృద్ధి పొందడానికీ, 3. ఇష్టదేవతోపాసనరూపమైన మంగళాచరణం స్మృత్యాచారసిద్ధం గనుకనూ మంగళశ్లోకాన్ని ఇక్కడ ఎంబెరుమానార్లు సాయించేరంటారు శ్రుతప్రకాశికాభట్టర్.

*మఙ్గళాచార యుక్తానాం నిత్యంచ ప్రయతాత్మనాం।*
*జపతాం జుహ్వతాంచైవ వినిపాతో న విద్యతే॥*

అని స్మృతివచనం. అంటే మంగళాచారం ఉన్నవాళ్ళూ, ఎప్పుడూ పరిశుద్ధమైన చిత్తవృత్తిగలవాళ్లూ, మంత్రాన్ని జపించేవాళ్ళూ, శాంతికపౌష్టికహోమాలని చేసేవాళ్ళూ అయిన పెద్దలకి వాళ్ళు ప్రారంభించిన కార్యం ఎటువంటి విఘ్నం, అనర్థం లేకుండా ఫలసిద్ధితో పూర్తి అవడం అనే విషయాన్ని తెలియజేస్తుంది. ఈప్రమాణవచనంలో చెప్పబడిన మంగళాన్నే ఎంబెరుమానార్లు ఇక్కడ శబ్దరూపంలో సాయించేరు అన్నది మనం తెలుసుకోవచ్చు.

సాధారణంగా మంగళం అనేది మూడువిధాలు. మంగళశ్లోకం ఈమూడు విధాలైన మంగళాల్లో ఏదో ఒకటిగాని ఒకటికంటే ఎక్కువవాటినిగాని తెలియజేసేదిగా ఉంటుంది. ఆశీర్వాదరూపంగానో లేక వస్తు నిర్దేశరూపంగానో లేకపోతే ఇష్టదేవతాప్రార్థనరూపంగానో మంగళశ్లోకం ఉండడం విశేషం. శ్రీభాష్యమంగళ శ్లోకంలో ఈమూడింటినీ కలిపి సాయించేరు శ్రీమద్రామానుజులవారు.

*"పరస్మిన్ బ్రహ్మణి శ్రీనివాసే - భక్తిరూపా శేముషీ మమ భవతు"* పరబ్రహ్మమైన శ్రీనివాసుడి విషయంలో భక్తిరూపాపన్న జ్ఞానం నాకు ఉండుగాక - అని శ్రీమద్రామానుజులు ప్రార్థించేరు. *"భవతు"* అనే పదం *"ఆశీస్సు"* - ఆశించడం (ఆశీర్వాదం అనేది కోరికని తెలియజేస్తుంది) అనేదాన్ని సూచిస్తోంది.

శాస్త్రార్థసంక్షేపాన్నీ, వస్తునిర్దేశాన్నీ, *"అఖిలభువనజన్మ స్థేమభంగాదిలీలే"* *"వినతవివిధభూతవ్రాత రక్షైకదీక్షే"* అన్న మొదటిరెండు పదాల్లో శ్రీమద్రామానుజులు సాయించేరు. ఒకగ్రంథాన్ని సాయించేటప్పుడు ఆగ్రంథంలో ప్రతిపాదింపబడిన శాస్త్రార్థసంక్షేపాన్ని మంగళశ్లోకంలో సాయించడమనేది ఒకఆచారం. గ్రంథంలో చెప్పబడ్డవిషయం -దీన్నే వస్తునిర్దేశం అంటారు- ఫలానిది అని తెలియజేసే కోరిక చాలామందికి ఉండవచ్చు. అటువంటివాళ్ళ బుద్ధి - కోరిక- సమాధానం పొందే కారణంగా తరువాత గ్రంథంలో చెప్పబడ్డ విషయాన్ని సంగ్రహంగా మంగళశ్లోకంలో చెప్పడం అనే పద్ధతిని అనుసరించి ఇక్కడ ఎంబెరుమానారులు మంగళశ్లోకాన్ని సాయించేరు అన్నది గమనించతగింది.

దీనికి శిష్టాచారం ఉన్నదా అంటే మహర్షులే ఈపద్ధతిని అనుసరించేరు అని మనం గమనించవచ్చు. శ్రీరామాయణంలో మొదటిసర్గ సంక్షేపరామాయణం. సంక్షేపరామాయణం, విస్తరరామాయణం అని వాల్మీకి భావించిన రెండువిధాలుగానూ ఉన్నట్టు మనం గమనించవచ్చు. వ్యాసులవారుకూడా మహాభారతాన్ని సంక్షేపంగానూ, విస్తరంగానూ సాయించేరు. శ్రీపరాశరమహర్షికూడా శ్రీవిష్ణుపురాణంలో ఇదే పద్ధతి ననుసరించేరు. వేదాంతార్థాలని సూక్ష్మంగానూ, విరివిగానూ మనస్సులో ఉంచుకోవడమనేది విద్వాంసులైన పెద్దలు ఆచరించే పద్ధతి. ఈఆచారంప్రకారం మనస్వామికూడా శారీరకశాస్త్రంలో నాలుగు అధ్యాయాల్లో చెప్పబడ్డ అర్థవిశేషాలని తాము శ్రీభాష్యంలో ఎలా వివరించేరో సూక్ష్మంగా మంగళశ్లోకంలో చూపించేరు.

ఈమంగళశ్లోకంలో శాస్త్రార్థసంక్షేపం శబ్దరూపంగానూ, అర్థంతోటీ చూపబడిందన్నదాన్ని వివరంగా మనం ఇకముందు అనుభవిద్దాం. ఇలా ఈమంగళశ్లోకంలో శబ్దరూపంగానూ, అర్థబలంచేతనూ శాస్త్రార్థాలు రామానుజులవారు చూపించేరనడానికి దృష్టాంతపరంగా ఒకవిషయాన్ని శ్రుతప్రకాశికాచార్యులవారు సాయించేరు. జైమిని సాయించిన పూర్వమీమాంసాశాస్త్రంలో రెండో సూత్రం *"చోదనా లక్షణోఽర్థో ధర్మః"* అని. ఈసూత్రంలో శబ్దరూపంగానూ, అర్థరూపంవల్లనూ రెండు విషయాలు నిరూపించబడ్డాయి. ధర్మ స్వరూపం శబ్దంవల్ల నిరూపించబడింది. దానికున్న ప్రమాణం అర్థంతో నిరూపించబడింది. చోదన అంటే కట్టడి. విధి వాక్యాలు వేదంలో కనబడుతాయి. *"ఈవిధివాక్యాలవల్ల ఏఅర్థం చెప్పబడుతోందో అదే ధర్మం"* అన్నది ఈసూత్రార్థం.

చోదనలక్షణంగా ఉన్నది - విధివాక్యానికి విషయమై ఉన్నది ఏదో, అది ధర్మం అనబడుతుంది. ఇలా ఇక్కడ ధర్మస్వరూపాన్ని శబ్దంద్వారా జైమిని చెప్పేరు. దానికి ప్రమాణం వేదంలో ఉన్న విధివాక్యాలు అని అర్థంతో చూపించేరు. *"ధర్మవిషయంలో ప్రమాణం వేదంలో కనబడే విధివాక్యాలు"* అని చెప్పి ఉంటే ఈనిజాన్ని శబ్దంతోటే చెప్పినట్లవును. కాని జైమిని అలా చెప్పలేదు. వారు ప్రమాణం అన్న మాట ప్రయోగించకుండా, *"విధివాక్యాలవల్ల చెప్పబడే అర్థం ధర్మం"* అని చెప్పడంవల్ల *"ధర్మాన్ని ఈవిధివాక్యాలు తెలియజేస్తున్నాయి; ఇలా ఏది తెలియజేస్తుందో అదే ప్రమాణం"* అన్ననిజాన్ని శాబ్దంగా కాకుండా, అర్థబలంతో చూపిస్తున్నారన్నది స్పష్టం అవుతోంది. శ్రీభాష్యమంగళశ్లోకంలో ఎంబెరుమానార్లుకూడా

శాబ్దంగానూ, అర్థబలంవల్లనూ స్వపక్ష స్థాపనం, పరపక్ష నిరసనం, వీటితో వస్తునిర్దేశాన్నీ చేసేరు.

*"వినత", "భక్తిరూపా"* అనే రెండు పదాలూ ఇష్టదేవతానమస్కారరూపమైన మంగళాన్ని తెలియజేసేవిగా ఉన్నాయి. *"వినత"* అన్నపదం నమస్కరించడాన్ని తెలియజేస్తుంది. *"భక్తి"* అనే పదం గొప్పవాడివిషయంలో తక్కువవాడు (అల్పుడు) చేసే ప్రీతివిశేషాన్ని సూచిస్తుంది. కనుక, ఈశ్లోకంలో మూడురకాలైన మంగళాలూ ఎంబెరుమానార్లవల్ల ఆచరింపబడ్డాయి అని స్పష్టం.

మొదటి రెండధ్యాయాల్లో ప్రతిపాదింపబడిన అర్థానికి సూక్ష్మం ***"అఖిలభువనజన్మ స్థేమభఙ్గాదిలీలే"*** అన్న మొదటిపాదంవల్ల తెలియజెప్పడం జరిగింది. రెండో రెండధ్యాయాల సారం ***"వినతవివిధభూతవ్రాత రక్షైకదీక్షే"*** అనే రెండో పాదంవల్ల చూపబడింది. కర్మమీమాంసా శాస్త్రం, దానివల్ల ప్రతిపాదింపబడుతున్న అర్థాల భేదంవల్ల ఎలా రెండు షట్కాలుగా (ఆరేసి అధ్యాయాలుగా) విభజించబడి ఉందో, అలాగే నాలుగు అధ్యాయాలున్న బ్రహ్మమీమాంసాశాస్త్రంకూడా ప్రతిపాద్యభేదంచేత రెండు ద్వికాలుగా (రెండేసి అధ్యాయాలుగా) విభజించబడింది. ఇక్కడ విషయవిషయీభేదం ప్రతిపాద్యభేదం అయింది. విషయాన్ని తెలియజేస్తున్నాయి మొదటి రెండు అధ్యాయాలున్నూ. విషయిని తెలియజేస్తున్నాయి తరువాతి రెండు అధ్యాయాలున్నూ. విషయం అంటే బ్రహ్మం. బ్రహ్మమనే విషయాన్ని తెలియజేస్తున్నాయి మొదటి రెండధ్యాయాలూ. బ్రహ్మయొక్క జగత్కారణత్వం మొదటి అధ్యాయంలో ప్రతిపాదింపబడింది. దాని సమర్థనం రెండో అధ్యాయంలో చెయ్యబడింది. ఇలా రెండో అధ్యాయంలో కూడా బ్రహ్మకారణమే విషయం అయింది.

మూడవ, నాల్గవ అధ్యాయాలు విషయిద్వికం అనబడుతున్నాయి. విషయీకరింపతగినది - ఏది విషయాన్ని గ్రహించగలదో అది విషయి అనబడుతుంది. అదే జ్ఞానం. మూడోఅధ్యాయం భక్తిరూపాపన్న జ్ఞానాన్ని తెలియజేస్తుంది. నాలుగో అధ్యాయం బ్రహ్మానుభవరూపమైన జ్ఞానాన్ని తెలియజేస్తోంది. బ్రహ్మ విషయంలోకలిగిన భక్తిరూపాపన్నజ్ఞానంవల్ల బ్రహ్మానుభవజ్ఞానం కలుగుతుంది. ఇదే నాలుగో అధ్యాయంలో తెలియజెయ్యబడుతోంది. ఇలా భక్తిరూపాపన్నజ్ఞానం, బ్రహ్మానుభవిజ్ఞానం అని జ్ఞానద్వయమైన విషయి లున్నదిగా ఏర్పడడంవల్ల మూడవ, నాలుగవ అధ్యాయాలు విషయిద్వికం అనబడుతున్నాయి.

ఈశారీరకశాస్త్రంవల్ల ప్రతిపాదింపబడుతున్న విషయం ఉపాయరూపంగానూ, ఉపేయరూపంగానూ ఉన్నది. ఉపాయం - సిద్ధోపాయం బ్రహ్మమే. సాధ్యోపాయంగా ఉన్నది భక్తి. కనుక, సిద్ధోపాయం, సాధ్యోపాయం అనే రెండింటినే ఈశాస్త్రం తెలియజేస్తోంది. ఉపేయం అన్నది బ్రహ్మమే. అంచేత ఉపాయంగానూ, ఉపేయంగానూ ఉన్నది బ్రహ్మమే అన్నది ఈశాస్త్రంతెలియజేస్తుంది. సిద్ధోపాయమైన బ్రహ్మన్ని మొదటి రెండధ్యాయాలూ తెలియజేస్తున్నాయి. సాధ్యోపాయమైన భక్తిని మూడో అధ్యాయం తెలియజేస్తోంది. ఉపేయమైన బ్రహ్మన్ని నాలుగో అధ్యాయం తెలియజేస్తోంది. ***"అఖిలభువనజన్మ స్థేమ భఙ్గాదిలీలే", "వినతవివిధభూతవ్రాతరక్షైకదీక్షే", "శ్రుతిశిరసి విదీప్తే", "బ్రహ్మణి శ్రీనివాసే"*** అని ఈశ్లోకంలో ఉన్న సప్తమీవిభక్తివాచకపదాలతో సిద్ధోపాయంగానూ, ఉపేయంగానూ ఉన్న బ్రహ్మం చెప్పబడుతోంది.

ఈశ్లోకంలోఉన్న *"భువన"*శబ్దం ఏఅర్థాన్ని తెలియజేస్తుందనేది ఇకతరువాత తెలుసుకోవలసిన విషయం. భువనశబ్దానికి సమస్తలోకాలూ అని ఎలా అర్థమైందో చూడాలి. భువనశబ్దానికి ఉన్న అవయవశక్తి ఏమిటంటే, ఏవి సృష్టింపబడినాయో, ఏవి ఉన్నాయో - వాటిని సూచిస్తుంది. దీన్ని బట్టి చూస్తే, అంతటా కనబడే కుండ, బాన, చట్టి వంటి అల్పపదార్థాలనికూడా ఈభువనశబ్దం సూచిస్తుంది. ఇది ఇక్కడ వివక్షితం గాదు. ఎలా అంటే, అల్పపదార్థాలని కార్యవర్గంగా ఇక్కడ చెప్పడంలో ఏమాత్రం రసంకూడా లేదు. ప్రయోజనం అంతకంటే లేదు. అల్పమైన పదార్థాలు సృష్టింపబడడానికి కారణమైన కుమ్మరివాడు, సాలెవాడు మొదలు (బ్రహ్మపర్యంతం) అందరినీ వ్యావర్తించి, సమస్తలోకాలకీ కారణభూతుడైన పరబ్రహ్మన్ని చెప్పడానికి భువనశబ్దానికున్న అవయవశక్తి ఉపకరించదు. కాని భువనశబ్దానికున్న రూఢి (సముదాయ) శక్తితో ప్రయత్నించినప్పుడు, చిన్న అల్పవస్తువులలాకాకుండా సమస్తలోకాలనీ -మహత్తైన కార్యవర్గాలనీ - ఈభువనశబ్దం చెప్తుందని, వాటికి కారణభూతుడైన పరమాత్మని తిన్నగా ఈశ్లోకంలో ప్రతిపాదించడానికి మార్గం ఉన్నది. కనుక ఇదే ఇక్కడ వివక్షితం అన్నట్టైంది.

సమస్తలోకాల్నీ, - ఒక్కటికూడా వదలకుండా - చెప్పడంకోసం *"అఖిలభువన"* అనే శబ్దాన్ని ప్రయోగించేరు శ్రీమద్రామానుజులవారు. *"అఖిల"* అనే శబ్దం (సామాన్యంగా అన్నీ అని చెప్పడానికి అవకాశం ఇవ్వకుండా) *"ఒక్కదాన్నీ వదలకుండా"* అనే అర్థాన్ని ఇస్తుంది. సర్వదేశాల్లోనూ, సర్వకాలాల్లోనూ, ఉండదగిన అండజాతాల్లో ఉన్న (అండసమూహాల్లో ఉన్నటువంటి) చేతనాచేతనాలు *"అఖిలభువన"* అనడంతో వివక్షింపబడుతున్నారు. *"సర్వదేశ-సర్వకాల-వర్తులైన అండజాతాలు"* అనడంవల్ల ఇక్కడ వివక్షింపబడే కార్యవర్గాలైనవి ఏవి అన్నది మనం చూడాలి.

*"అణ్డానాంతు సహస్రాణామ్ సహస్రాణ్యయుతాని చ।*
*ఈదృశానాం తథా తత్ర కోటికోటిశతాని చ॥* (వి.పు. 2-7-27)

అని విష్ణుపురాణంలో పరాశరమహర్షి సాయించేరు. వెయ్యిని వెయ్యిచేత హెచ్చించి, వచ్చే సంఖ్యని కోటిని కోటితో హెచ్చించి దాన్ని నూరుతో హెచ్చించి వచ్చే సంఖ్యతో హెచ్చిస్తే ఏసంఖ్య వస్తుందో, దానితో చెప్పడానికి సాధ్యంగాని అండజాతాలు. ఈశ్లోకంలో అండాలు అనంతం అన్నదాన్ని ఇలా ఒక పెద్ద సంఖ్యగా చెప్పి చూపిస్తున్నారు శ్రీపరాశరమహర్షి. ఇలా చెప్పబడిన అండాలుఒకే సమయంలో ఉన్నవి. ఒక్కొక్క అండంలోనూ మీదని ఏడు, కిందని ఏడు లోకాలుగా మొత్తం పధ్నాలుగు లోకాలు ఉన్నాయి. ఈపధ్నాలుగు లోకాల్నీ చుట్టి ఒక ఆవరణం ఉన్నది. ఒక్కొక్క అండానికీ ఒక్కొక్క బ్రహ్మ ఉన్నాడు. ఇలా ఉన్న అండాలు లెక్కకి మించినవని మనం తెలుసుకోవాలి. సృష్టికాలంలో ఇన్ని అండాలున్నాయి. మహాప్రళయకాలంలో ఇన్ని అండాలూ నశించిపోతున్నాయి. మహాసృష్టికాలంలో ఇవన్నీ మళ్ళీ సృష్టింపబడుతున్నాయి. ఇలా సర్వదేశాల్లోనూ ఉన్న అండాలుమాత్రం ఇక్కడ *"అఖిల"* శబ్దంవల్ల వివక్షితంకాలేదు. గడిచిపోయిన కాలంలోనూ, (ఇంతవరకూ ఎన్నో మహాప్రళయాలు, మహాసృష్టులూ జరిగిపోయినాయి) వచ్చే కాలంలోనూ (పైగా ఎన్నో మహాప్రళయాలు, మహాసృష్టులూ జరగబోతున్నాయి) ఉన్న అండాలు అన్నీ ఇక్కడ వివక్షింపబడుతున్నాయి.వీటన్నింటికీ కారణభూతుడైన భగవానుడు ఒక్కడే. *"అణ్డక్కులత్తుక్కు అదిపదియాగి"* (తిరుప్పల్లాణ్డు- 5) అని పెరియాళ్వారుకూడాసాయించేరు. దీనివల్ల బ్రహ్మ, ప్రజాపతుల వ్యావృత్తి సిద్ధిస్తోంది.

కాని ఈఅర్థాన్ని చూపించడానికి *"అఖిల"* అనే శబ్దాన్ని ఎందుకు ఎంబెరుమానార్లు ప్రయోగించేరు? *"సర్వ"* *"నిఖిల"* వంటి శబ్దాలని వారు ప్రయోగించవచ్చుగదా! స్వామి సూచించినట్లుగా ఇక్కడ *"అఖిల"* శబ్ద ప్రయోగం చెయ్యడానికి ఏమిటి అభిప్రాయం? అనే ప్రశ్న ఇక్కడ వస్తోంది. దీనికి అత్యాశ్చర్యంగా శ్రుతప్రకాశికాచార్యులవారు వివరణం అనుగ్రహించేరు.

*"అఖిల"* శబ్దానికి అవయవవ్యుత్పత్తి *"ఖిలం నాస్తీతి అఖిలమ్"* అన్నది. చెదిరిపోయిన భాగాన్ని ఖిలం అంటారు. ఇది లేనిది అఖిలం అనబడుతుంది. అంటే ఏమీ వదలకుండా సమస్తం అని అర్థం. ఇలా కార్యవస్తువుల్లో పరబ్రహ్మంతాలూకు సృష్ట్యాదివ్యాపారాలకి విషయంకానిది ఏదీ లేదు అనే యథార్థాన్ని *"అఖిల"*శబ్దం వ్యతిరేకముఖంగా (ఏదీవదలకుండా అన్నీ అని అనడంవల్ల) చూపిస్తోంది అన్నదాన్ని మనం ఇక్కడ తెలుసుకుంటున్నాం.

వ్యతిరేకముఖంద్వారా చెప్పడంవల్ల "ప్రాయికత్వం" (సామాన్యంగా సమస్తం అని అర్థం ఉన్నది) తప్పించబడుతుంది అనడంవల్ల ఇక్కడ వ్యతిరేకముఖంగా చెప్పడం లేకుండా ఉండదు. సర్వేశ్వరుడిని చూసి *"అజ్ఞాతం నాస్తి తే కిఞ్చిత్"* - **నీవల్ల తెలుసుకోబడని విషయం ఏదీ లేదు** అనే ఈఅర్థాన్ని అన్వయముఖంగాకూడా చెప్పవచ్చు. కాని "***నీకు అంతా తెలుసును***" అని చెప్పేటప్పుడు, "***అంతా***" అనే శబ్దం అనేది "***సామాన్యంగా అంతా - సమస్తం***" అనే అర్థాన్నిస్తుంది. అలా కాకుండా "***నీకు తెలియనిది ఏమీలేదు***" అని వ్యతిరేకముఖంగా చెప్పినప్పుడు ఇది "***సామాన్యంగా అంతా తెలుసును***" అనే అర్థాన్ని తప్పించేసి, "***దేన్నీ వదలకుండా అంతా తెలుసును.***" అనే అర్థాన్నే స్థిరంగా స్థాపించి చూపుతుంది. ఇలా వ్యతిరేకముఖంగా ఒకవిషయాన్ని గురించి చెప్పేటప్పుడు చెప్పబడవలసిన విషయం బాగా దృఢీకరించ బడి అర్థపౌష్కల్యంతో వివరింపబడడం చూస్తున్నాం.

ఇది కాక *"సకల"* శబ్దం అన్వయముఖంగా "***అంతా***" అనే అర్థాన్ని చూపడంవల్ల ఇందులో అర్థపూర్తి లేదు. *"అఖిల"* శబ్దం వ్యతిరేకముఖంగా "***దేన్నీ వదలకుండా అంతా***" అనే అర్థాన్ని చూపించడంవల్ల ఇందులోనే అర్థపౌష్కల్యం ఉన్నదని మనం చూస్తున్నాం. కనుక ఇలా వ్యతిరేకముఖంగా ఈయథార్థాన్ని దృఢంగా చూపాలి అనడంకోసమే ఇక్కడ *"సకలభువన"* అనకుండా *"అఖిలభువన"* అనే శబ్దాన్ని ఎంబెరుమానార్లు ప్రయోగించేరు అని మనకి తెలుస్తోంది. కాని *"నిఖిలభువన"* అని చెప్పినాకూడా అర్థం అదే లభిస్తుందిగదా! ఎందుకు ఎంబెరుమానార్లు *"నిఖిలభువన"* అని ఆరంభించలేదు? అని ఆక్షేపం రావచ్చు. అకారంతో ఉపక్రమంలో గ్రంథం ఉండాలి - గ్రంథాన్ని *"అఖిల"* అన్న అకారంతో ఆరంభించాలి అని ఎంబెరుమానార్లు భావించినట్లుగా తెలుస్తోంది. గ్రంథాన్ని అకారంతో ఆరంభించడంలో ఏమిటి విశేషం అంటే, - అకారం భగవద్వాచకమై ఉండడంచేత పరమమంగళకరమైనది.

*"అథ శబ్దానుశాసనమ్"* అని మహాభాష్యం ఆరంభం. ఇక్కడ "***మంగళశ్లోకం అంటూ వేరుగా సాయించబడకుండా ఆరంభించబడిందే***" అని ఆక్షేపం వస్తే *"అ ఇతి భగవతో నారాయణస్య ప్రథమాభిధానం అభిదధతా కిం నామ మఙ్గళం న కృతమ్?"* అని సమాధానం సాయించబడింది. ఇష్టదేవతోపాసనమే మంగళాచరణం గదా! ఇక్కడ ***అథ*** అని అకారంలో గ్రంథారంభం అమరి ఉండడంవల్ల - అకారం భగవాన్

నారాయణుడి మొదటి తిరునామం అనడంవల్ల (భగవద్వాచకమైన అకారంలో గ్రంధం ఆరంభింపబడి ఉండడంవల్ల) గ్రంధకర్తవల్ల ఏమంగళం అనుష్ఠింపబడలేదు?అంటే వారు సమస్తమంగళాన్నీ అనుష్ఠించిన వారై నారు - అని చూపబడింది.

ఇక్కడ ఇంకా మరో ఆక్షేపం రావచ్చు. అదేమిటంటే, ***"అథ శబ్దానుశాసనమ్"*** అన్నదాంట్లో ***"అథ"*** అన్నది ఒక పదం. ఇందులోంచి అకారాన్ని వేరుగా విరవడానికి సాధ్యంగాదు. ***అథ*** అన్నట్లైతే, ***"ఆరంభః"*** అని అర్థం. ఆరంభార్థమైన ***అథ***శబ్దంలోంచి ***"అ"*** అనే అక్షరాన్ని వేరుచేసి దానికి ***"భగవద్వాచకం"*** అని అర్థం చెప్పడం కుదరదు. కనుక ఇక్కడ అకారవాచకం భగవద్వాచకం అనే అర్థంలో రాలేదు. వస్తేకదా అది మంగళకరమైన ఉపక్రమం అన్న రీతిలో ఉంటుంది? ఇక్కడ ***"అథ"*** శబ్దప్రయోగాన్ని అకారంతో ఉపక్రమంగా చెప్పడం ఎలా కుదురుతుంది? అనే ఆక్షేపం. దీనికి సమాధానం ఏమిటంటే, అకారం భగవద్వాచకం అనే అర్థంలో ఇక్కడ గ్రంధకర్త ప్రయోగించకపోయినప్పటికీ, భగవంతుడిని సూచించగల శక్తి అకారానికి ఉండడాన్ని ఎవరూ కాదనలేరు. ఈశక్తి అనేది అకారమనే ఈఅక్షరానికి ఎప్పుడూ ఉండడంవల్ల అకార ఉపక్రమంలో పదాలు ఎలా కుదురుతాయో ఏఅర్థాన్ని చెప్పినప్పటికీ అకారంలాగే అకార ఉపక్రమంకూడా మంగళప్రదమే అనే స్థితికి భంగంరాదు. అంచేత ఇక్కడ ***"అథ"*** శబ్దం భగవానుడిని సూచిస్తుందని ఎవరూ చెప్పలేదు. కాని అకారానికి భగవద్వాచకత్వం అనేది ఎప్పుడూ ఉన్న ఒకస్వభావంగనుక, అకారఉపక్రమం ఇక్కడ మంగళకరంగానే ఉన్నది అన్నదే యథార్థం.

అదే ఇక్కడకూడా తీసుకోవాలి. అంటే, ***"అఖిల"*** అనే శబ్దం ***"దేన్నీ వదలకుండా అంతా"*** అనే అర్థంలోనే వచ్చినప్పటికీ, ఈపదంతాలూకు మొదటి అక్షరమైన అకారానికి భగవద్వాచకత్వం అనే గుణం ఉండడంవల్లనే పరమమంగళకరమైన ఈఅక్షరంలో గ్రంధాన్ని ఉపక్రమించాలి అని ఎంబెరుమానార్లు భావించేరని మనకి తెలుస్తుంది.

ఇక్కడ మరో ఆక్షేపం వస్తోంది. ***"ఖిలం నాస్తి ఇతి అఖిలమ్"*** అని ఉండడంవల్ల ***నాస్తి*** అని మొదటే నిషేధానికివాచకమైన ***"న"*** అనే శబ్దం ప్రయోగించబడిందే! ఇది అమంగళంగా కనబడలేదా? అన్నది ఈఆక్షేపం. ఇక్కడ మనం తెలుసుకోవలసిన యథార్థం ఏమిటంటే, నిషేధింపబడుతున్న వస్తువు ఏదో దానితో ***"నఞ్"*** ఘటితమైన శబ్దానికి శుభత్వమో అశుభత్వమో వస్తుందేతప్ప నిషేధించడంవల్ల శుభత్వమో అశుభత్వమో రాదు. నిషేధింపబడుతున్న వస్తువు శుభంగా ఉంటుందంటే, "నఞ్"తో కలిసిన పదానికి అశుభత్వం వస్తుంది. కాని ఇక్కడ అలాలేదు. ఇక్కడ చెదిరిపోవడం అనే గుణమైన ఖిలత్వం నిషేధింపబడడంవల్ల ***"అఖిల"*** శబ్దానికి శుభత్వమే వచ్చిచేరుతోంది. ***"ఖిలమ్"*** అనే పదం (అర్థంలో) వైకల్యాన్ని (లోటుని) చూపిస్తోంది. దాన్ని నిషేధించడంమూలంగా అఖిలశబ్దమనేది అర్థపౌష్కల్యపరంగా ఉన్నది అన్నదే నిజం.

***"జన్మ"*** అన్నది (ఉత్పత్తి అనే) సృష్టిని తెలియజేస్తుంది. ఇది నిత్యం, నైమిత్తికం, ప్రాకృతం అని మూడు విధాలుగానున్నది. మనకి ప్రతీరోజూ జరిగే పుట్టుక నిత్యసృష్టి అనబడుతుంది. మహాప్రళయకాలం పూర్తి అయిపోయి మహాసృష్టిని భగవంతుడు చేయడం ప్రాకృతసృష్టి అనబడుతుంది. ప్రాకృతసృష్టికి తరువాత బ్రహ్మగారి ఒక్కొక్క పగటికాలం ప్రారంభంలోనూ, భూలోకం, భువర్లోకం, సువర్లోకం అనబడే

మూడులోకాలూ సృష్టింపబడతాయి. ఇది నైమిత్తికసృష్టి అనబడుతుంది. ఈవిధంగా మూడువిధాలుగా ఉండే సృష్టికి భగవానుడే కారణం.

*"స్థేమ"* - ఇది స్థితి, రక్షణం అనబడుతుంది. సాధారణంగా రక్షింపబడే గుణం స్థితి అనబడుతుంది. కాని బ్రహ్మానికి లీల అని చెప్పినప్పుడు *"స్థేమ"* పదానికి బ్రహ్మయొక్క రక్షణస్వభావాన్ని అర్థంగా తీసుకోవాలి. భగవంతుడు కటాక్షించే రక్షణమే *"స్థేమ"* పదంవల్ల లక్షణగా భావింపబడుతుంది. బ్రహ్మాంతాలూకు రక్షణం ఎలా జరుగుతుంది అన్నది చూడాలి. *"జన్మ"* అని చెప్పినప్పుడు నిత్య, నైమిత్తిక, ప్రాకృతిక సృష్టి అని సృష్టిని మూడురకాలుగా చెప్పడంలాగ భగవంతుడు చేసే రక్షణకూడా మూడువిధాలుగా ఉన్నది. మహాసృష్టి కాలంలో భగవానుడు సమష్టి తత్త్వాలని సృష్టిస్తున్నాడు. తర్వాత అంతర్యామిగాఉండి సమష్టితత్త్వాలని రక్షిస్తున్నాడు. వీటిస్థితికి అంతర్యామిగా ఉంటూ కారణమౌతున్నాడు. ప్రకృతి, మహత్తు, అహంకారం, పంచతన్మాత్రలు, పంచభూతాలు, పదకొండు ఇంద్రియాలూ, ఇవి సమష్టితత్త్వాలు. వీటిని సృష్టించిన తర్వాత అండాన్ని సృష్టించి అండానికి లోపల విష్ణువుగా అవతరిస్తున్నాడు. ఇలా విష్ణువుగా ఉండి ఎన్నో పదార్థాలని రక్షిస్తూ వస్తున్నాడు. ఇది వ్యష్టితత్త్వాల రక్షణం. అంతర్యామిగా ఉండి, రక్షించడం అన్నది సామాన్యంగా అన్ని విషయాల్లోనూ ఉంటుంది.

తర్వాత లోకపాలకులు. తూర్పుదిశకి ఇంద్రుడు, దక్షిణానికి యముడు, పడమరకి వరుణుడు, ఉత్తరానికి కుబేరుడు అని నలుగురు లోకపాలకులు. లోకాన్ని రక్షించేవాళ్ళు లోకపాలకులు. వీళ్ళద్వారా లోకాన్ని రక్షించేవాడు భగవంతుడే. ఇదికూడా వ్యష్టితత్త్వాల రక్షణే. ఇవన్నీ నైమిత్తికరక్షణంలో ఇమిడి ఉన్నవే. నైమిత్తికసృష్టి తర్వాత నైమిత్తిక రక్షణం. నిత్యజన్మవల్ల సృష్టించబడిన పదార్థాలన్నింటినీ మన్వాదులు, రాజులు, తల్లి, తండ్రి, బంధువులు, మిత్రుల ద్వారా రక్షిస్తున్నాడు. ఇలా ప్రాకృత, నైమిత్తికనిత్య స్థితి అని భగవంతుడు చేసే రక్షణం మూడు విధాలుగా ఉన్నది.

*"భంగ"* అంటే లయం, నాశం అని అర్థం. ఇదికూడా నిత్యం, నైమిత్తికం, ప్రాకృతం అని మూడు విధాలు. ప్రతిరోజూ, బ్రహ్మ నిద్రిస్తున్నప్పుడు జీవుడు సర్వేశ్వరుడిలో లయించడం నిత్య ప్రళయం. బ్రహ్మగారి రాత్రి నిమిత్తంగా జరుగుతున్నది నైమిత్తికప్రళయం. నైమిత్తికసృష్టికాలంలో బ్రహ్మచేత సృష్టింపబడ్డ భూలోకం, భువర్లోకం, సువర్లోకం, అనే మూడులోకాలూ నైమిత్తికంగా ప్రళయంలో నశించిపోతాయి.

ఆరుమాసాలు గల అయనం అనబడే ఉత్తరాయణం, దక్షిణాయనం అనే అయనాలు రెండువిధాలు. దక్షిణాయనం దేవతలకి రాత్రిగానూ, ఉత్తరాయణం దేవతలకి పగలుగాను ఉన్నాయి. మనుష్యమానంలో ఒకసంవత్సరం దేవతలకి ఒకరోజు. ఈవిధంగా 360 దేవతలదినాలు దేవవర్షం. ఇలాంటి 12000 దేవవర్షాలు గలది ఒక చతుర్యుగం. వెయ్యి చతుర్యుగాలు బ్రహ్మకి ఒక పగలవుతుంది. మరో వెయ్య చతుర్యుగాలు బ్రహ్మగారికి రాత్రి. ఇలా నూరుసంవత్సరాలు బ్రహ్మగారి ఆయుర్దాయం. దీనికి పరం అని పేరు. బ్రహ్మగారి అయువు మూడినప్పుడు మహాప్రళయం ప్రాకృతలయం జరుగుతుంది. ప్రపంచం పూర్తిగా ప్రకృతిలో లయమైపోతుంది. ఆప్రకృతి పరమాత్మలో ఏకీభావంతో ఒదిగిపోయి ఉండడంతో దీనికి ప్రాకృతలయం

అనబడుతుంది. మహాప్రళయకాలంలో జీవాత్మలకి శరీరం నశించిపోయి మళ్ళీ సృష్టికాలంలో భగవంతుడి చేత కర్మనిబంధనమైన కళేబరాలని పొందుతాయి.

ఒకజీవుడికి కర్మనిబంధనంగా ఏర్పడ్డ ప్రాకృతశరీరంతో సంబంధం నశించడం మోక్షకాలంలోనే. అంచేత ఇది కూడా లయమే. కాని ఇటువంటి లయం ***"అఖిలభువనజన్మ స్థేమభంగాదిలీలే"*** అన్నప్పుడు భంగశబ్దంవల్లోలేక ఆదిశబ్దంవల్లో నిర్దేశింపబడలేదు. ఎందుకంటే, మోక్షం అన్నది పరమపురుషార్థం. ఈశారీరకమీమాంసాశాస్త్రానికే మోక్షం అనేది పరమప్రయోజనంగా భావించబడుతోంది. అంచేత దీన్ని భంగశబ్దంలోగాని ఆదిశబ్దంలోగాని అంతర్భూతంగా - ఇమిడిఉన్నట్టుగా - అనుకోవడానికి సాధ్యంగాదు. ఆదిశబ్దం సామాన్యమైనది. మోక్షం అనేది విశేషంగానో, స్పష్టంగానో కనబడదు. మోక్షం పరమప్రయోజనం అంటే స్పష్టంగా చూపబడగలగాలి. ఇది మనపూర్వాచార్యులవల్ల వేరుగా స్పష్టంగా నిర్దేశింపబడి ఉండడాన్ని మనం చూస్తున్నాం.

***జగదుద్భవస్థితిప్రణాశసంసారవిమోచనాదయః*** (స్తో.ర. 20) అన్న శ్రీసూక్తిలో సంసారవిమోచనం అని మోక్షం వేరుగా (బ్రహ్మకార్యంగా) స్పష్టంగా సాయించబడింది.

సిద్ధిత్రయంలోకూడా ***"ఉద్భవస్థితిప్రళయసంసారనివర్తనైకహేతుభూతః*** అనినీ, శ్రీభాష్యంలో సర్వత్రప్రసిద్ధ్యధికరణం అవతారికలో ***"నిఖిలజగదుదయవిభవమహానంద్రైకకారణం*** అనినీ మోక్షాన్ని వేరుగా సూచించేరు.

జగజ్జన్మాదికారణత్వంలాగే మోక్షకారణత్వంకూడా బ్రహ్మలక్షణమే అవుతుంది. నమ్మాళ్వారు *"ఉయర్వఱ ఉయర్నలం ఉడైయవన్"* అని బ్రహ్మశబ్దానికి ప్రవృత్తినిమిత్తమైన నిరతిశయబృహత్త్వాన్ని సాయించి, వెంటనే *"మయర్వఱ మదినలం అరుళినన్"* అని బ్రహ్మలక్షణమైన మోక్షకారణత్వాన్ని సాయించేరు. *"మయర్వఱ మదినలం అరుళినన్"* - అంటే - ***"అవిద్యానివృత్తిరేవహి మోక్షః"*** అన్నట్టుగా (అజ్ఞాననివృత్తి అనే) సంసారవిమోచన (మోక్ష) కారణత్వంతోటే (బ్రహ్మలక్షణమైన జగజ్జన్మాది కారణత్వాన్ని స్థాపించే) జన్మాద్యధికరణ ప్రమేయాన్ని నమ్మాళ్వారులు సూచనని కటాక్షించేరని మన పూర్వాచార్యులు చూపిస్తున్నారు.

*"యద్యపి సంవిశన్తి"* అని వేదాంతంకూడా జగత్ప్రళయకారణత్వాన్నీ, సంసారవిమోచన కారణత్వాన్నీ స్పష్టంగా చెప్తోంది. దీనివల్ల మోక్షకారణత్వాన్ని భంగశబ్దంలోనో, లేక ఆదిశబ్దంలోనో అంతర్భావం చెయ్యకూడదు అన్నది మనమతాచార్యులఉద్దేశమని తెలుస్తోంది.

***వినతవివిధభూతవ్రాతరక్షైకదీక్షే*** అన్న రెండోపాదంలో సూచింపబడిన రక్షణమే మోక్షప్రదానం. ఈరక్షణం ప్రత్యేకంగా సర్వేశ్వరుడి మోక్షప్రదత్వాన్ని చూపిస్తుంది. స్వర్గాదులైన సాంసారికఫలప్రదత్వం అనేది మొదటిపాదంలోఉన్న ***స్థేమ*** పదంవల్లనే చెప్పబడిఉండడంవల్ల రెండోపాదంలో "***నమస్కరించిన వారిని రక్షించేవాడు***" అని చెప్పినప్పుడు సాంసారికఫలాల్ని ఇవ్వడం అనే రక్షణం చెప్పబడవలసిన అవసరంలేదు. ఈశారీరకశాస్త్రంలో పరమప్రయోజనంగానూ, అసాధారణంగానూ చెప్పబడుతున్న మోక్షాన్ని బట్టే వేరుగా ముక్త్యత్వం (ముఖ్యత్వం) ఇవ్వడం అనేమాటని చెప్పవలసి రావడం అవశ్యం.

మోక్షప్రదత్వం అనేది వేరుగా రెండో పాదంలో చెప్పబడిందంటే మొదటిపాదంలో ఉన్న **ఆది**శబ్దంవల్ల నిర్దేశింపబడ్డది ఏమిటి? అనే ప్రశ్న తర్వాత వస్తుంది. ***జగజ్జన్మక్షేమభంగ***వ్యాపారాలకి ఉపయోగపడగల ***అంతఃప్రవేశనియమనం*** ఆదిశబ్దంవల్ల చెప్పబడుతోంది. దీన్ని ఎంబెరుమానార్లే శ్రీభాష్యంలో తాముసాయించిన ***"జగదుత్పత్తిస్థితిసంహార అంతఃప్రవేశనియమనాదిలీలం"*** అన్న శ్రీసూక్తిద్వారా స్పష్టపరిచేరని చూపిస్తున్నారు శ్రుతప్రకాశికాచార్యులవారు.

పరమాత్మ అన్నింటిలోనూ ప్రవేశించి నియమిస్తాడన్నదాన్ని చూపించే

***"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః"*** (తై. నారా), ***"అంతః ప్రవిష్ట శాస్తా జనానామ్"*** ***"అహమాత్మా"*** (గీత-10-20) అన్న ప్రమాణాలు ఇక్కడ అనుసంధేయాలు.

ఇక్కడఒక ఆక్షేపం వస్తోంది. జగదుత్పత్తి జరగాలంటే, దానికి భగవంతుడు లోపల ప్రవేశించి నియమించాలి. జగద్రక్షణకోసంకూడా, అంతఃప్రవేశనియమనాదులు అవశ్యం. ఈవిధంగా జగత్తుతాలూకు జన్మ, క్షేమ, భంగ వ్యాపారాలు మూడింటికీకూడా అంతఃప్రవేశనియమనాదులు అవశ్యమై ఉండడంవల్ల ***"అఖిలభువనజన్మక్షేమభంగవ్యాపారాలని లీలగా గలవాడు"*** అని చెప్పడంవల్లనే అంతఃప్రవేశ నియమనాదులు అర్థబలంవల్ల సిద్ధిస్తున్నాయిగదా! ఇలా ఉండగా వీటిని వేరుగా **ఆది** శబ్దంతో చెప్పవలసిన అవసరం ఏమొచ్చింది అన్నదే ఈఆక్షేపం. ఇలా జగజ్జన్మక్షేమభంగాలలో అంతఃప్రవేశనియమనాన్ని అర్థంలో ఇమిడ్చి చెప్పడం అన్నది అయుక్తం అనిచెప్పడానికీ, వీటిని ఇక్కడ వేరుగా ***"ఆది"*** శబ్దంతో ఎంబెరుమానారులు చెప్పడానికీ, మూడుకారణాలని శ్రుతప్రకాశికాచార్యులవారు చెప్పేరు.

1. ***అధ్యాస పరిణామ పక్షాలు*** అని రెండు మతాలు. ***అద్వైతులది అధ్యాస పక్షం. యాదవ ప్రకాశుల మతం పరిణామపక్షం.*** అధ్యాసం అంటే భ్రమ. ***"ఈలోకం సృష్టించబడిందిగాదు. ప్రపంచం అనేది బ్రహ్మనిగురించిన అజ్ఞానం అవడంవల్ల కల్పించబడిన ఒక మిథ్యావతారం. ఒక ముత్యపుచిప్ప ఎలా అజ్ఞానంవల్ల వెండి అన్నట్టుగా మిథ్యగా కనిపిస్తుందో, అలాగే బ్రహ్మస్వరూపాన్ని తెలియని కారణంగా, అది ప్రపంచం అనే భ్రమని - మిథ్యని సృష్టిస్తుంది"*** అంటారు అద్వైతులు. కనుక, వీరిపక్షంలో అంతఃప్రవేశ నియమనాదులకి ప్రసక్తే లేదు. యాదవప్రకాశులమతంలో ***బ్రహ్మమే చేతనాచేతనాలుగా పరిణమిస్తోంది*** అని చెప్పడంవల్ల ఇక్కడకూడా బ్రహ్మానికి అంతఃప్రవేశనియమనాదులకి అవకాశంలేదు. కనుక, ఈరెండుమతాలనీ వ్యావర్తించడంకోసం ఎంబెరుమానార్లకి తమమతంప్రకారం ఇక్కడ వీటిని ఆదిశబ్దంచేతనే వేరుగా చెప్పవలసివచ్చింది.

2. ఇక్కడ ***"ఆది"*** శబ్దంతో అంతఃప్రవేశనియమనాదులని వేరుగా చెప్పవలసిఉండగా, అలా శాబ్దంగా చెప్పకుండా, జగజ్జన్మక్షేమభంగశబ్దాల అర్థబలంతో వీటిని ఆంతరంగా ఉన్నట్టుగా సూచించడం అనేది ఉచితంగాదు. శాబ్దంగా చెప్పగలిగిన ఒకవిషయానికి శాబ్దంగాకాకుండా అర్థంవల్ల సిద్ధిని కల్పించడం అనేది యుక్తంగాదు.

3. అంతర్యామ్యధికరణశ్రీభాష్యంలో అంతఃప్రవేశనియమనాదులనిగురించి విస్తారంగా సాయించేరు ఎంబెరుమానార్లు. అక్కడ విస్తారంగా చూపబడిన అర్థాలని శాస్త్రార్థసంక్షేపాన్ని

చూపించినట్లుగా ఉన్న మంగళశ్లోకంలో వేరుగా చూపించడం అన్నది తగినదే. కనుక, ఇలా మూడు కారణాలవల్ల *"ఆది"* శబ్దార్థంగా అంతఃప్రవేశనియమనాదులని విడివిడిగా చూపించేరు ఎంబెరుమానార్లు అని చూపించి సాయించేరు శ్రుతప్రకాశికాచార్యులవారు.

*"లీలే"* - లీలాశబ్దంవల్ల తెలియజేయబడేది ఏమిటి? భగవంతుడు జగజ్జన్మస్థేమభంగాది వ్యాపారాలని పరిపూర్ణుడై, వేరెవరిచేతనూ నియమింపబడనివాడై, అనన్యప్రయోజనమై కేవలలీలగా తీసుకున్నవాడు అనే అర్థాన్ని తెలియజేస్తుంది లీలాశబ్దం అని వ్యాఖ్యానం.

***అప్రమేయోఽనియోజ్యశ్చ యత్ర కామకో వశీ। మోదతే భగవాన్ భూతైర్బాలః క్రీడనకైరివ॥*** అనే మహాభారత శ్లోకం దీనికి ప్రమాణం. ఎంబెరుమానుడు అప్రమేయుడై - పరిపూర్ణుడై - ఉన్నాడు. ఇతరులచేత నియమింపబడతగనివాడై, ఉండే గుణం అనియోజ్యత్వం అనబడుతుంది. తన ఇచ్ఛప్రకారం చెయ్యడానికి ఆటంకంలేని ప్రవృత్తులని గలవాడై ఉన్నాడు పెరుమాళ్ళు. స్వాధీనమైన లీలోపకరణాలు గలవాడు - అంటే లోకాలన్నింటినీ లీలోపకరణాలుగా తనవశంలో గలవాడు భగవానుడు. *"విశ్వం వశే యస్య సః వశీ"* అంటారు శ్రుతప్రకాశికాచార్యులవారు. ఈజగత్తు ఎవనికి వశపడి ఉన్నదో వాడు "వశీ" అనబడుతున్నాడు. *"ఇంద్రియ పరాధీన చేష్టావ్యావృత్తమే వశీ శబ్దార్థం"* అంటారు వ్యాఖ్యాత. అంటే ఇంద్రియాలకి వశపడకుండా స్వాధీనమైన వ్యాపారవిశేషాలు గలవాడు వశీ అన్నమాట. ఒక పిల్లవాడు మరబొమ్మలని పెట్టుకొని ఆడుకుంటున్నట్లుగా ఇతనుకూడా ఇటువంటి వ్యాపారాలని అనన్యప్రయోజనమై లీలగానే తీసుకున్నవాడు. భగవానుడి మహిమయొక్క విపులతరత్వాన్ని ఈశ్లోకంలోఉన్న క్రీడనకైః అన్న పదం చూపిస్తోంది. అంటే, కార్యవర్గాలైనఇన్ని భూతాలూ ఎంబెరుమానుడికి మరబొమ్మలవంటివంటే, ఆయన ఎంత మహిమ గలవాడుగా ఉండాలి!

కనుక, జగత్తుతాలూకు ఉత్పత్తి భగవానిడికి లీల, జగత్తుతాలూకు స్థితికూడా భగవానుడికి లీలే. జగత్తుతాలూకు భంగంకూడా స్వామికి లీలే. జగజ్జన్మస్థేమభంగవ్యాపారాల లీలారసం అనుభవించేవాడు భగవానుడు అన్నది మొదటిపాదంతాలూకు అర్థం అని తేలుతోంది. వీటిలో జగదుత్పత్తి, స్థితివ్యాపారాలు భగవానుడిని గురించికాకుండా జగత్తునిగురించినవిగా ఉండడంవల్ల ఇవి ఆయనకి లీలగా కుదురుతాయా అనే శంకతో దానికి సమాధానాన్ని అత్యాశ్చర్యకరంగా సాయించేరు శ్రుతప్రకాశికాచార్యులవారు. ఈవిషయాన్నిగురించి కొంచెం వివరించుకుందాం.

ఆక్షేపం- లీల అంటే ఏమిటి? లీల అనేది నియన్తగా ఉన్నవాడి వ్యాపారం. నియమించేవాడు ప్రయోజకుడు. ప్రయోజకవ్యాపారం లీల. ప్రయోజకుడి కార్యమే లీల.

నియమింపబడే వస్తువులలో ఉండే వ్యాపారం ప్రయోజ్యవ్యాపారం. ఆజ్ఞాపించబడేవాడు ఆజ్ఞలని నిర్వర్తించే కింకరుడు. నియమింపబడేవాడు ప్రయోజ్యుడు అనబడుతారు. వీడివిషయంలో ఉన్న వ్యాపారం ప్రయోజ్యవ్యాపారం.

దీనిప్రకారం చూస్తే, జగద్భంగం (కారణభూతమైన బ్రహ్మంవిషయంలో కార్యాలు అతిసూక్ష్మ మైన స్వరూపంతో కుంచించుకుపోవడం అనే స్థితి) భగవానుడిలో లయం అని చూడబడడంవల్ల ఈవ్యాపారాన్ని ప్రయోజకవ్యాపారంగానూ, భగవానుడిని ప్రయోజకుడిగానూ చెప్పడానికి లోటులేదు. ఈకారణాలవల్ల భంగంఅనే వ్యాపారాన్ని భగవంతుడికి లీలగా తీసుకోవడం కుదురుతుంది.

కాని జగదుత్పత్తి స్థితి వ్యాపారాలు భగవానుడిచేత ఆజ్ఞాపించబడుతున్న జగత్తునిగురించినవిగనుక ఇవి ప్రయోజ్యవ్యాపారాలు. ప్రయోజకవ్యాపారాలుగా ఉంటేగదా ఇవి భగవానుడికి లీలగా కుదురుతాయి! ప్రయోజ్యవ్యాపారాలని భగవానుడికి ఎలా లీలగా చెప్పడం కుదురుతుంది?

సమాధానం -- *"బహుస్యామ్ ప్రజాయేయ"* అన్న ఛాందోగ్యోపనిషద్వాక్యం "**నేను అనేకములుగా అగుగాక**" అనే సర్వేశ్వరుడి సృష్టిసంకల్పాన్ని తెలియజేస్తున్నాయి. భగవానుడు మొదట "**నేను అనేకములుగా (వ్యష్టి తత్త్వాలుగా) అగుదునుగాక**" అన్న తర్వాత **నేను అనేకములుగా (సమష్టితత్త్వాలుగా) అగుదునుగాక** అని సంకల్పం చేసేడు. సంకల్పకాలంలో సంకల్పం ఇలా ఉన్నప్పటికీ సృష్టికాలంలో మొదట ప్రకృతి, మహత్తు, అహంకారం, పంచతన్మాత్రలు, పంచభూతాలు, పదకొండు ఇంద్రియాలు అని సమష్టి తత్త్వాలని మొదట సృష్టించి తర్వాత వ్యష్టితత్త్వాలు సృష్టింపబడసాధ్యం. కనుక, ఇతనే అనేకములుగా (చేతనాచేతనాలుగా) అయినాడు అంటే జగత్తుకి ఉపాదానకారణంగా ఇతనే అయినాడు అనే యథార్థాన్ని ఈఉపనిషద్వాక్యం మనకి చూపిస్తోంది. జగదుత్పత్తికి తర్వాత ఏస్థితి ఏర్పడుతుందో అట్టి స్థితి భగవానుడికే ఉన్నదిగా అవుతుంది అంటే, జగజ్జన్మస్థితులు భగవానుడితో కలిసిఉన్న వ్యాపారాలుగా చూడబడుతాయి. ఇందువల్ల ప్రయోజకత్వంకూడా ఈయనకే సిద్ధిస్తుంది. ఇలా ప్రయోజకవ్యాపారంకూడా భగవానుడికే ఉండడంవల్ల వీటినికూడా (జగజ్జన్మస్థితులని) ఈయనకి లీలగా తీసుకోవడంలో తప్పులేదు. ఏవస్తువు పూర్వావస్థ, ఉత్తరావస్థలు గలదిగా కనబడుతుందో, అదే ఉపాదానకారణం. ఇక్కడ చేతనాచేతనాలుగా భగవానుడే అవడంవల్ల ఆయనే ఉపాదానకారణం అనే అర్థం సిద్ధిస్తోంది. కనుక జగజ్జన్మక్షేమవ్యాపారాల లీలాత్వం భగవానుడికే అనే యథార్థం లీలాశబ్దంవల్ల బోధింపబడుతోంది. భగవానుడి ఉపాదానకారణత్వం అర్థంవల్ల సిద్ధిస్తోంది. లీలారసం అనేది జ్ఞానంగలవాడికి కలిగేదిగనుక, అర్థబలంతో సర్వేశ్వరుడినిమిత్తకారణత్వంకూడా ఫలిస్తోంది అంటున్నారు శ్రుతప్రకాశికాచార్యులవారు.

శారీరకమీమాంసాశాస్త్రం రెండో అధ్యాయానికి "***అవిరోధాధ్యాయం***" అని పేరు. ఈఅధ్యాయం పూర్తిగా విరోధపరిహారపరమే. అంటే, మొదటి అధ్యాయంలో చెప్పబడ్డ అర్థాన్ని (దానిమీద వచ్చే విరోధశంకలని పరిహరించడంద్వారా) స్థిరీకరణం చేస్తుంది (దిట్టపరుస్తుంది) రెండో అధ్యాయం. మొదటి అధ్యాయంలో బ్రహ్మనికి చెప్పబడ్డ జగజ్జన్మాదికారణత్వం, జగత్తుకి చెప్పబడ్డ బ్రహ్మకార్యత్వమున్నూ ఈఅధ్యాయంలో స్థిరీకరింపబడ్డాయన్నమాట. అంటే, ఈఅర్థాలమీద వచ్చే ఆక్షేపాలు, విరోధశంకలు పరిహరింపబడుతున్నాయన్నమాట.

ఈ అధ్యాయంలో *ప్రయోజనవత్త్వాధికరణం* (2-1-10) అని ఒక అధికరణం. ఈఅధికరణంలో భగవంతుడు అవాప్తసమస్తకాముడై (సమస్తఫలాలనీ పొందినవాడై) ఉండడంవల్ల జగత్సృష్టిమొదలైన వ్యాపారాలవల్ల ఆయన పొందవలసిన ఫలాలేమీ లేవు. జగజ్జన్మాదివ్యాపారాలకి ఒక ప్రయోజనం

ఉండాలిగనుకనున్నూ, ఈయన సర్వప్రయోజనాలనీ ముందుగానే పొందే ఉన్నాడుగనుకనూ ఈయన జగజ్జన్మాదులకి కారణుడుగా కుదరడని పూర్వపక్షం. దీనిమీద *"లోకవత్తు లీలా కైవల్యమ్"* (2-1-33) (కేవల లీలే జగత్సృష్టి మొదలైనవాటికి ప్రయోజనం) అని సిద్ధాంతసూత్రం ఉన్నది. *"భగవంతుడు జగజ్జన్మదివ్యాపారాలతో లీలారసాన్ని పొందుతున్నాడు. ఇదే వీటికి ప్రయోజనం"* అన్నది ఇక్కడ సిద్ధాంతీకరించబడ్డ అర్థం. ఇలా ఈఅధికరణంలో భగవానుడి అవాప్తసమస్తకామత్వంవల్ల జగజ్జన్మాది వ్యాపారకారణత్వానికి వచ్చే విరోధాన్ని - జగత్సృష్ట్యాదివ్యాపారానికి వచ్చే అనుపపత్తిని - ఈలీల అనే ప్రయోజనం పరిహరిస్తోంది అన్నది చూపబడుతోంది.

ఈఅధికరణంలో స్థాపించబడ్డ ఈఅర్థాన్ని *"అఖిలభువనజన్మ స్థేమభంగాదిలీలే"* అన్న మొదటి పాదంలో ఉన్న *"లీలా"* శబ్దం చూపించేటట్లుగా ఏర్పాటై ఉన్నది. దీంతో ఇలాంటి విరోధశంకాపరిహారమై ఉన్న రెండో అధ్యాయం పూర్తిగా ఈలీలాశబ్దంవల్ల సూచింపబడుతోంది అని మనం చెప్పుకోవచ్చు. ఇలా రెండో అధ్యాయం సంగ్రహంగా ఈలీలాపదం అమరిఉండడంవల్ల *"అఖిలభువనజన్మ స్థేమభంగాదిలీలే"* అనే మొదటిపాదం పూర్తిగా మొదటి రెండధ్యాయాల సంగ్రహంగా ఉండి, ఈరెండధ్యాయాలపరమార్థమైన బ్రహ్మనికున్న జగజ్జన్మాది కారణత్వరూపమైనపరత్వాన్ని చూపడం మనకి తెలుస్తుంది.

నమ్మాళ్వారు భగవంతుడు పరాత్పరుడు అనే అర్థాన్ని తిరువాయ్మొళ్ళిలో మొదటిపదిలో సాయించేరు. ఆయన భజనీయుడనేఅర్థాన్ని రెండోపదిలో మనకి చూపించేరు. ఈక్రమంలోనే ఇక్కడకూడా ఏర్పాటవడాన్ని మనం గమనించవచ్చు. మొదటిపాదంవల్ల భగవానుడి జగజ్జన్మాదికారణత్వరూపమైన పరత్వం చూపబడింది అన్నది కనబడుతుంది. *"వినతవివిధభూతవ్రాతరక్షైకదీక్షే"* అన్న రెండోపాదం ఆయన అందరివల్లా ఆశ్రయింపబడదగినవాడన్న అర్థాన్ని చూపడంకోసం ఆయన అభిగమ్యత్వాన్ని మోక్షప్రదత్వోపయోగియైన సౌలభ్యాన్నీ మనకి తెలిపేటట్లు ఏర్పడిఉన్నాయి. అభిగమ్యత్వమూ, సౌలభ్యమూ మోక్షప్రదత్వలక్షణాలు. అందరిచేతా సులభంగా చేరదగిఉండడం అభిగమ్యత్వం అనబడుతుంది. కేవలపరత్వం ఎవళ్ళకీ ఉపయోగించదు. పరత్వం, సౌలభ్యం కలిసి ఉంటేనే ఈగుణాలు మనలాంటవాళ్ళవిషయంలో కార్యకరంగా ఉంటాయి.

మొదటి రెండు పాదాలూ విశేషణాలుగా ఉండి, భగవంతుడి ఈరెండు కల్యాణగుణాలనీ మనకి చూపిస్తున్నాయి. తిరువాయ్మొళ్ళి మొదటి రెండు పదులూ (+మూడో పదిలో మొదటిపాశురం) శారీరకశాస్త్రానికి సారభూతమైన అర్థవిశేషాలని అంతర్భూతంగా కలిగి ఉన్నవనే యథార్థాన్ని "ఉభయవేదాన్తైకకంఠ్యం" అని మనపూర్వాచార్యులు అనుభవించి వివరించేరు. ఇలా శారీరకశాస్త్రసారంగా తిరువాయ్మొళ్ళి ప్రారంభంలో చూపబడిన అర్థాలే ఇక్కడ శ్రీభాష్యసారంగా మొదటి రెండు పాదాలవల్లా చూపబడిందని మనం గమనిస్తాం. *"భాష్యకారర్ ఇదు(తిరువాయ్మొళ్ళి) కొణ్డు సూత్రవాక్యఙ్గళ్ ఒరుఙ్గవిడువర్ - భాష్యకారులు దీనితో (తిరువాయ్మొళ్ళితో) సూత్రవాక్యాలని కలిపేరు"* అని ఆచార్య హృదయంలో (65) నాయనార్ సాయించేరు.

*"వినత"* - నమస్కరించిన. విశేషంగా నమస్కరించినవాళ్ళు వినతులు. బలతరమైన అధికారులు

న్యాసం, ఉపాసనం వంటి విద్యావిశేషాలలో నిష్ఠులై అభినివేశంతో ఉంటారు.

*"వివిధ"* - *"**అనేకవిధములైన**"* అని అర్థం. మొదటధ్యాయంలో **దేవతాధికరణం** (1-3-7) అని ఒక అధికరణం. అందులో మొదటి సూత్రం *"తదుపర్యపి బాదరాయణః సంభవాత్"* (1-3-25) అన్నది. *"**బ్రహ్మోపాసనం మనుష్యులకంటే ఉన్నతులైన దేవతలు గంధర్వులు, మొదలైనవాళ్ళకీ సంభవిస్తుంది - ఎందుకంటే, వాళ్ళకికూడా అర్థిత్వం (బ్రహ్మోపాసనంలో కోరిక) సామర్థ్యం (దేహం, ఇంద్రియాలూ మొదలైనవి) ఉండడంవల్ల**"* అని సిద్ధాంతీకరించి ఉన్నారు శ్రీవేదవ్యాసులవారు. దీనివల్ల దేవతలు గంధర్వులు మొదలైనవాళ్ళుకూడా సర్వేశ్వరుడిని నమస్కరిస్తున్నారని స్పష్టం అవుతోంది.

*"ఊర్ధ్వరేతస్సు చ శబ్దే హి"* (3-4-17) అని మూడో అధ్యాయంలో **పురుషార్థాధికరణంలో** (3-4-1) ఒకసూత్రం. ఇందులో సన్యాసాశ్రమాన్ని స్వీకరించినవారివిషయంలోకూడా బ్రహ్మవిద్య కనబడుతోందని చెప్పబడింది. *'**బ్రహ్మోపాసనానికి అగ్నిహోత్రంవంటి కర్మలు అవశ్యంగనుకనూ, గృహస్థులే వాటిని ఆచరించడానికి అధికారంగలవాళ్ళుగనుకనూ వాళ్ళకిమాత్రమే బ్రహ్మోపాసనకి అధికారం ఉన్నది**"* అంటారు జైమిని. దీన్ని ఆక్షేపిస్తూ *"**ఊర్ధ్వరేతస్కులకికూడా (బ్రహ్మచారులకీ, వానప్రస్థులకీ, సన్యాసులకీ) బ్రహ్మవిద్యలో అధికారం ఉన్నది**"* అని సిద్ధాంతీకరణం చేసేరు శ్రీవేదవ్యాసులవారు.

అంచేత జన్మవల్ల భేదంమనుష్యులకీ, దేవతలూ మొదలైనవాళ్ళకీ ఉన్నప్పటికీ, బ్రహ్మోపాసన విషయంలో అందరికీ అధికారం ఉన్నదని చెప్పబడుతోంది. ఆశ్రమంవల్ల భేదం చెప్పబడ్డా, నాలుగువిధాల ఆశ్రమాలకి చెందినవాళ్ళకీ బ్రహ్మవిద్యలో అధికారం ఉన్నది. అలాగే బ్రహ్మక్షత్రియవైశ్యులకి చెందిన వాళ్ళలో ఆచార, అనుష్ఠానభేదాలున్నా, వీళ్ళకీ బ్రహ్మవిద్యలో అధికారం ఉన్నది. బ్రహ్మోపాసనకి కావలసిన ఈఅధికారులు త్రివిధగుణభేదంవల్ల అనేకవిధాలై ఉన్నారన్నది యథార్థం. ఉదాహరణానికి దేవతలకి మనుష్యులకంటే సత్వగుణం ఎక్కువగా ఉంటుంది. ఇలా జన్మచేతనూ, వర్ణాశ్రమభేదంవల్ల వచ్చే ఆచారంవల్లనూ, త్రివిధగుణభేదంవల్లనూ బ్రహ్మోపాసనానికి అధికారులు అనేకవిధాలుగా ఉన్నారు. ఇలా జన్మభేదంవల్ల నమస్కరించేవాళ్ళూ, వర్ణాశ్రమభేదంవల్ల నమస్కరించేవాళ్ళూ, త్రివిధగుణభేదంవల్ల నమస్కరించేవాళ్ళూ అని లోకంలో ఉన్న అనేకవిధాలైన అధికారులచేత న్యాసం, ఉపాసనం వంటి పలువిధాలైన మార్గాలలో విశేషంగా నమస్కరింపబడుతున్నాడు సర్వేశ్వరుడనే అభిప్రాయం తోచగా ఇక్కడ ఆఅధికారులనిగురించి ఎంబెరుమానారులు *"వివిధ"* శబ్దాన్ని ప్రయోగించేరు.

*"భూతవ్రాత"* భగవత్-జ్ఞానంతో పొందబడ్డ సత్తనిగలవాళ్ళు ఇక్కడ భూతశబ్దంవల్ల చెప్పబడుతున్నారు.

*"అస్తి బ్రహ్మేతి చేత్ వేద, సన్తమేనం తతో విదుః"* (బ్రహ్మజ్ఞానం ఉన్నవాడిని "సత్" అని జ్ఞానులు ప్రశంసిస్తారు.) అని శ్రుతిలో చెప్పబడిఉన్నది. ఇటువంటి జ్ఞానుల గొప్పదనం ఏమిటి? అన్నది భగవద్గీతలో భగవానుడు విస్తారంగా నిరూపించి సాయిస్తున్నాడు.

*తేషామేవానుకమ్పార్థ మహమజ్ఞానజం తమః। నాశయామ్యాత్మభావస్థః జ్ఞానదీ భాస్వతా॥*

(గీత-10-11) (స్వయంప్రయోజనభక్తినిష్ఠులమీద నాకున్న కటాక్షంవల్లనే నేను వాళ్ళనమస్సులకి

విషయమైనవాడినై నాగురించిన జ్ఞానం అనే తేజోవంతమైన దీపంలాగ వాళ్ళజ్ఞానానికి విరోధిగానున్న శబ్దాదివిషయప్రావణ్యం అనే చీకటిని నశింపజేస్తాను) అనిన్నీ,

*తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకం। దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తితే॥* (గీత 10-10) (నాతో ఎల్లప్పుడూ కలిసి ఉండాలి అనికోరినవాళ్ళై నామీద స్వయంప్రయోజనమైన భక్తిని గలవాళ్ళై ఉన్నవాళ్ళకి వాళ్ళు నన్ను పొందడానికి ఉపకరించే భక్తియోగాన్ని ఎంతో ఆనందంతో ఇస్తాను.) అనిన్నీ,

*అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్॥* (వరాహచరమశ్లోకం) (ప్రపన్నుడైన నాభక్తుడిని వాడిమరణసమయంలో నేను తల్చుకుంటాను. వాడిని నేను ఉత్తమమైన గతికి తీసుకువెళ్తాను.) అని భగవానుడే సాయించడంవల్ల భగవత్సాక్షాత్కారానికి ఉన్న విరోధివర్గాన్ని నిరసనం చెయ్యడం అన్నది భగవత్కృత్యంగా ఉండడంవల్ల ఇటువంటి జ్ఞానులు, భగవచ్ఛేషత్వమనే స్వరూపజ్ఞానాన్ని పొందిన వీళ్ళు తిరిగీ అజ్ఞానాన్ని పొందరు అని అర్థం. ఇటువంటి అధికారులలాగే ఈఅధికారులతో సంబంధం ఉన్నవాళ్ళుకూడా ఇలా భగవానుడివల్ల రక్షింపబడతగినవాళ్ళని చూపడంకోసం *"భూతవ్రాత"* అని ఎంబెరుమానార్లు సాయించేరు. *"భూత సంబంధీ వ్రాతః భూతవ్రాతః"* అని వ్యుత్పత్తి. అంటే భూతాలవ్రాతం భూతవ్రాతం అన్నమాట. ఇక్కడ భూతాలంటే బ్రహ్మజ్ఞానులన్నమాట. వాళ్ళతో సంబంధంగలవాళ్ళు భూతవ్రాతాలు. భూతవ్రాతం అన్నది భూతసంబంధుల సమూహం.

*ఆస్ఫోటయన్తి పితరః ప్రనృత్యన్తి పితామహాః। వైష్ణవో నఃకులే జాతః స నః సంధారయిష్యతి॥*

అనిన్నీ

*"పశుర్మనుష్యః పక్షీవా యే చ వైష్ణవసంశ్రయాః। తేనైవ తే ప్రయాస్యన్తి తద్విష్ణోః పరమం పదమ్॥*

అనిన్నీ శాస్త్రవచనాలు. ఒకకులంలో ఒకవైష్ణవుడు పుట్టేడంటే **"వీడు మనని ఉత్తారణం చెయ్యబోతున్నాడు"** అని వాడి పితలు చప్పట్లుకొట్టుకుంటారు; పితామహులు ఆనందనృత్యం చేస్తారు. వీడితో సంబంధం గల 21తరాలవాళ్ళు (వీడు, వీడి తండ్రి, తాత, ముత్తాత, వీడి పిల్లడు, పౌత్రుడు, ప్రపౌత్రుడు అని ఏడు తరాలు, వీడి ముత్తాతగారికి మీదనున్న ఏడు తరాలు, వీడి ప్రపౌత్రుడికి తరువాతి ఏడు తరాలు) ఉద్దరించబడుతారు. వీడితో సంబంధం ఉన్నవాళ్ళు ఏమీ చెయ్యలేదు. వీడిసంబంధంతో వీడిసంబంధులకి ఉద్ధరణం చూడబడుతోంది. పశువుగాని, మనుష్యుడుగాని, పక్షిగాని, వైష్ణవులని చేరినవాళ్ళు అలా పొందిన ఆశ్రీవైష్ణవుడి సంబంధంతో విష్ణులోకమైన పరమపదాన్ని వెళ్ళిపొందుతారు. వీడికిమోక్షం సిద్ధించినట్లు వీడితోసంబంధంఉన్న జ్ఞానయోగ్యతలేని తిర్యక్,స్థావరాలుకూడా యోగ్యతఉన్నా కూడా జ్ఞానంలేకుండాఉన్నసంబంధులకీ వీడిసంబంధమేహేతువుగా మోక్షం సిద్ధిస్తోందని ఈప్రమాణ వచనాల సారమైన అర్థం. దీన్నే *"సంశ్రిత సంబంధినోఽపి తత ఏవ కారణాత్ భగవతా రక్ష్యా ఇత్యభిప్రాయః"* అని శ్రుతప్రకాశికాచార్యులవారు స్పష్టంగా సాయించేరు.

శ్రీవైష్ణవుల గొప్పతనాన్నీ, వాళ్ళ నడవడినీ వాళ్ళ సంబంధం ఉన్నవాళ్ళ నడవడినీ విశేషించి కటాక్షించే సర్వేశ్వరుడి స్వభావాన్నీ ఒకటిగా చేర్చి ఇక్కడ ఎంబెరుమానార్లు *"భూతవ్రాతరక్షైకదీక్షే"* అని చూపించేరన్నదే మనం గమనిస్తాం. ఇక నమ్మాళ్వార్ల అనుభవాన్ని చూద్దాం. నమ్మాళ్వారు

*"ఎమర్కీళ్మేలెళ్లుపిఱప్పుమ్ విడియావెన్నగరత్తు ఎన్నుమ్ శేర్దల్ మాఱినరే"* అని తిరువాయ్ మొళ్లి (2-6-7)లో సాయించేరు. *"కీళ్లుమ్ మేలుమ్ ఎన్నైచ్చేర్న్దవర్గళ్, పెరుజ్మాడాగ పరప్పిన్ ఎల్లామ్ తొలైయప్పట్టు ఒరునాళుమ్ ఒయ్విల్లాద కొడియ సమ్సారనరగత్తిల్ శేరామలిరుక్కుమ్బడి పెఱ్ఱార్గళ్* అంటున్నారు నమ్మాళ్వారు. ఈభావాన్నే తరువాతిదైన ***కేశవన్దమర్ దశకం***లో మొదటిపాశురంలో *కేశవన్దమర్ కీళ్మేల్ ఎమర్ఏళ్ ఎళ్లుపిఱప్పుమ్ మాశదిర్ ఇదుపెఱ్ఱు నమ్ముడై వాళ్వు వాయ్క్కిన్దవా* అని వివరించేరు.

*"సమ్బన్ది సమ్బన్దిగళ్ పక్కలిలుమ్ ఎమ్బెరుమాన్ అభినివిష్టనానపడియై క్కణ్డు 'ఇదెల్లామ్ ఎన్పక్కలుణ్డాన విషయీకారాతిశయమిఱే' ఎన్ఱు హృష్టరాగిఱార్"* అన్న ఈడులోని శ్రీసూక్తి ఇక్కడ అనుభవించతగినది. *ఆళ్వారైప్పోలే అవర్ సమ్బన్దమడియాగ అవరైచ్చేర్న్దవర్గళ్ కీళ్లుమ్ మేలుమ్ ఉళ్ళ ఏళ్ ఏళ్ పిఱప్పుగళిలుమ్ కేశవన్దమర్ (అవనుడైయ అవయవసౌన్దర్యత్తిలే తోఱుక్కుమ్ శ్రీవైష్ణవర్గళ్) ఆనార్గళ్* అన్నది ఈపాశురానికున్న భావం.

*"అళ్లగు నిఱైన్ద దివ్యమఙ్గళవిగ్రహవిశిష్టనాయ్, నిత్యసూరినాదనాయ్, ఎనక్కు స్వామియాయ్ ఇరుక్కిఱ నారాయణనాలే, ఎన్నోడు ఏదేనుమొరుపడి సమ్బన్దమ్ ఉడైయవర్గళ్ ఎల్లారుమ్ కేశవన్దమర్ ఎన్నుమ్బడియాన శిఱప్పుమ్ పెఱ్ఱార్గళ్. అదనాలే నమ్ముడైయ శ్రీవైష్ణవశ్రీ విలక్షణమాగవుళ్ళదు ఎన్గిఱార్"* అని శ్రీ ఉ వే. మహావిద్వాన్ కాఞ్చీ ప్రతివాది భయంకరం అణ్ణఙ్గరాచార్యస్వామివారు అత్యద్భుతంగా ఈపాశురభావాన్ని వర్ణించడంకూడా ఇక్కడ అనుభవింపతగినదే. *"జ్ఞానానుష్టానఙ్గళై యొళ్లిన్దాలుమ్ పేఱ్ఱుక్కు అవర్గళ్ పక్కల్ సమ్బన్దమే అమైగిఱాప్పోలే..."* అని శ్రీవచనభూషణసూత్రం (204) "అంటే, ***ఉభాభ్యామేవ పక్షాభ్యా మాకాశే పక్షిణాం గతిః। తథైవ జ్ఞానకర్మభ్యాం ప్రాప్యతే భగవాన్ హరిః॥***, **అనిన్నీ**, *"వీశుమ్ శిఱగాలే పఱత్తిర్ విణ్ణుఙ్ఞు నుఙ్గట్కెళిదు"* అని చెప్పున్నట్టుగా - భగవల్లాభ హేతువైన తత్త్వజ్ఞానంకూడా తదనురూపానుష్ఠానం లేకపోయినా, భగవల్లాభానికి *"పశుర్మనుష్యః పక్షీవా యే చ వైష్ణవసంశ్రయాః। తేనైవ తే ప్రయాస్యన్తి తద్విష్ణోః పరమం పదమ్॥* అనిన్నీ, *యం యం స్పృశతి పాణిభ్యాం యం యం పశ్యతి చక్షుషా। స్థావరాణ్యపి ముచ్యన్తే కిం పునర్ బాన్ధవా జనాః॥* (ఎవరెవరు శ్రీవైష్ణవుడైనవాడిని తన చేతులతో స్పృశిస్తాడో అటువంటివాడు ఎవరెవరిని చూస్తాడో, అలా చూడబడిన స్థావరాలుకూడా ముక్తిని పొందుతున్నాయ్. అటువంటప్పుడు బంధువులని గురించి వేరే ప్రశ్నించాలా?) అని చెప్పినట్లుగా, *"భాగవతసంబంధమే నిరపేక్షసాధనమైనట్లుగా..."* అని ఇక్కడ మణవాళమామునుల వ్యాఖ్యానం ఉన్నది. *"భాగవతోత్తములైన శ్రీవైష్ణవులతో సంబంధంగల వారిని భగవంతుడు రక్షిస్తాడు"* అని *"భూతవ్రాతరక్షైకదీక్షే"* అన్నప్పుడు ఎంబెరుమానార్లు చూపించిన అర్థమే ఈసూత్రార్థానికి మూలకారణం గానూ, దాని తాత్పర్యార్థంగానూ ఉన్నది అని ఇక్కడ మనం స్పష్టంగా చూడగలం.

*"భూతవ్రాత"* అన్నదాంట్లో *"వ్రాత"* శబ్దం ఏఅర్థాన్ని చూపుతోంది అన్నదాంట్లో ఒక చర్చ ఉన్నది. *"బ్రాహ్మణసమాజం"* అంటేబ్రాహ్మణుల సమాజం అనే అర్థం చేసుకుంటాం. అలాగే *"భూతవ్రాత"* అంటే *"భూతానాం వ్రాతః భూతవ్రాతః"* అని విగ్రహం చెప్పుకుని, భూతముల (బ్రహ్మజ్ఞానుల) సమాజం అని అర్థం చెప్పడమేతగినదిగదా!

ఈవాదం అయుక్తం అని చూపిస్తున్నారు శ్రుతప్రకాశికాచార్యులవారు. "***బ్రాహ్మణసమాజం***" అనే వ్యవహారాన్ని ఇక్కడ ఉదాహరణంగా తీసుకోవడం యుక్తంగాదు. ఎందువల్లనంటే, "***బ్రాహ్మణసమాజం***" అనడంలో సముదాయికీ సముదాయానికీ భేదంలేకపోవడం ఉన్నది. "***రాజపరిషత్తు***" అన్న వ్యవహారాన్ని తీసుకుందాం. "***రాజపరిషత్తు***" అన్నదాంట్లో, "***బ్రాహ్మణసమాజం***" అన్నదాంట్లోలాగే "***రాజుల పరిషత్తు***" అని మనం అర్థం చెప్పుకోవడంలేదు. "***రాజుగారి పరిషత్తు***" అనే అర్థాన్నే చెప్పుకుంటున్నాం. ఇక్కడ రాజుగా ఉన్నవాడు ఒక్కడే. ఆయననికాకుండా, ఆయనతో సంబంధం ఉన్న మంత్రులు, మిగతా అధికారులు, ప్రజలు వంటి వాళ్ళనే ఈ"**పరిషత్తు**"శబ్దం సూచిస్తోంది! "***రాజపరిషత్తు***" అన్నదాంట్లో సముదాయికంటే సముదాయానికి భిన్నత్వం కనబడుతోంది. కనుక, లోకంలో కొన్ని వ్యవహారాలు "***బ్రాహ్మణసమాజం***" అన్నరీతిలో ఏర్పడ్డవి. మరికొన్ని "***రాజపరిషత్తు***" అన్నరీతిలో ఉపయోగపడుతున్నాయి. ఇలాగే ఎక్కడ ఎలా ఉపయోగం జరుగుతుందో - మనం ఎలా అర్థం చేసుకోవాలో అన్నదానికి గీటురాయి "***సముదాయికంటే సముదాయం వేరుగా ఉన్నదా, లేదా***" అన్నదే. ఇక్కడ "*భూతవ్రాత*" అనడానికి "***భూతముల సంబంధుల సమూహం***" అని అని అర్థం చెప్పుకోవడం ఉచితం.

ఇలా అర్థం చెప్పుకున్నందువల్లనే ఇక్కడ చెయ్యబడిన "*వ్రాత*"శబ్దప్రయోగానికి ప్రయోజకత్వం సిద్ధిస్తుంది. భూతాలని మాత్రం భగవంతుడు రక్షిస్తాడంటే ఇక్కడ "*వ్రాత*" శబ్దప్రయోగం చేసే అవశ్యమే లేదు. భూతశబ్దాన్నే జాత్యేకవచనంగా భగవంతుడు భూతాలని రక్షిస్తాడని అర్థం చెప్పవచ్చు. ఇక్కడ "*వ్రాత*"శబ్దప్రయోగం ఉండడంవల్ల "*వ్రాత*"శబ్దానికి ప్రామాణికంగా ఎంత అర్థం చెప్పుకోవాలో అంత అర్థాన్ని చెప్పుకుంటేనే "*వ్రాత*"శబ్దప్రయోగానికున్న ప్రయోజనం పూర్తిగా సిద్ధిస్తుంది. సర్వేశ్వరుడి వైభవం కూడా ఉన్నదున్నట్టుగా చక్కగా ప్రకాశిస్తుంది.

ఇక తరువాత "*రక్షైకదీక్షే*" అన్నదాంట్లో ఉన్న "*రక్షా*" అనే శబ్దం ఏఅర్థాన్ని చూపిస్తోందో అన్నదాన్ని చూద్దాం. ఇష్టాన్ని పొందడంలో ప్రయత్నంగా అనిష్టాన్ని పోగొట్టడంఅన్నదాన్ని ఈశబ్దం చూపిస్తుంది. ఇటువంటి రక్షలో ప్రధానదీక్షితుడిగా భగవంతుడు ఉన్నాడు ఈరక్షా సంకల్పాన్ని నడిపించడంలో అత్యంతాభిమతత్వం ఆయనకి ఉన్నదని చూపబడుతోంది. తన సత్తకంటే, తన ఆశ్రితులైన ఈఋషుల రక్షణచెయ్యడంలోనే ఈయనకి ఎక్కువ అభినివేశం. "*అప్యహం జీవితం జహ్యామ్*" అని శ్రీరామాయణంలో పెరుమాళ్ళ వాక్కు. "***ఈఋషులకోసం నా ప్రాణాలనికూడా వదులుతాను***" అంటాడు భగవానుడు. దీనివల్ల తన దాసుల అనిష్టాలని తొలగించి అభీష్టాన్ని తీర్చడంకోసమే తన సత్తనే తీసుకుంటాడు భగవానుడు అని ఆయన వైభవం చూపబడుతోంది.

ఇక్కడ భగవంతుడిని గురించిన రెండుయథార్థాలని మనం బాగా తెలుసుకొని అనుభవిద్దాం. భగవానుడు తన సత్తకంటే తన ఆశ్రితుల రక్షణనే ముఖ్యంగా (ప్రధానదీక్షగా) తీసుకుంటాడు. దీనివల్ల ఆయనదీక్షతాలూకు ప్రాధాన్యం తెలుస్తోంది. తన సత్తనే తన ఆశ్రితుల రక్షణకి కలిగిఉంటాడు అనడంతో రక్షయొక్క ప్రాధాన్యం తెలియబడుతోంది. కనుక, దీక్షాప్రాధాన్యతవల్ల రక్షాప్రాధాన్యం ఫలిస్తోంది.

"*కామం ఆత్మానం భార్యాం పుత్రంవా ఉపరున్ధ్యాత న త్వేవ దసకర్మకరమ్*" అని ఆపస్తంబుల సూత్రం. ఒకడు తననో, తనభార్యాబిడ్డలనో, అన్నపానాదులలో లోటువల్ల కలిగే కష్టానికి వశం జేస్తాడు. కాని దాసకర్మకరుడు (తనకోసం ఎవడు దాసత్వం చేస్తున్నాడో వాడు) ఆకలితో బాధపడేటట్లు చెయ్యకూడదు. తన ఆజ్ఞారూపమైన ఈస్మృతివచనాన్ని ఆయన దాసులమైన మనకారణంగా భగవానుడే దృఢత్వంతో అనుష్ఠిస్తున్నాడని అనడంవల్ల ఆయన తనమనస్సులో తనఆశ్రితుల రక్షణని ఎంతముఖ్యంగా తీసుకుంటున్నడన్నదాన్ని మనకి తెలుస్తోంది.

ఈదీక్షా శబ్దం మరో ముఖ్యమైన అర్థాన్ని చూపిస్తోంది. జీవుడు భగవానుడి రక్షణని అపేక్షిస్తాడు. ఆయనదగ్గర ప్రార్థిస్తాడు. అంటే, వాడిని భగవానుడు రక్షిస్తున్నాడని గాదు. జీవుడి ఉపాయాంతర అనుష్ఠానాన్ని చూసి, భగవానుడు వాడిని రక్షిస్తున్నాడనిగాదు. ఈరక్షణ అనేది భగవానుడికే స్వయంప్రయోజనంగా ఉన్నది. భగవానుడి రక్షణకి వీడికి అధికారం ఉంటే చాలు. అధికారం ఏది? "***ఆయన రక్షణని వీడు అడ్డుకోకుండా ఉంటే చాలు***" అని మన ఆచార్యులు సాయించేరు. భగవానుడి కృప నిర్హేతుకం అన్నది ఇక్కడ (శ్రుతప్రకాశికాచార్యులవారి శ్రీసూక్తివల్ల) స్పష్టంగా తెలుస్తోంది. భగవానుడి రక్షణం ఔపాధికం అంటే, (ఇక్కడ శ్రుతప్రకాశికాచార్యులవారు చూపించినప్రకారం) రక్షణం అన్నది ఎలా ఆయనకి స్వయంప్రయోజనంగా ఉండసాధ్యం? చేతనులవిషయంలో భగవానుడు చేసే రక్షణం స్వయంప్రయోజనం - భగవంతుడు తనకి లాభంగానే చేతనుడిని రక్షిస్తున్నాడు - అంటే, "***చేతనలాభం ఈశ్వరుడికి***" అనే యథార్థం ఇక్కడ అర్థబలంచేత సిద్ధిస్తోంది.

ఈయథార్థాన్ని ఇంకా స్పష్టంగా మనం తెలుసుకుందాం. భూతవ్రాతరక్షణం అనే దీక్షని ప్రధానవ్రతంగా గలవాడు భగవానుడు అంటే మనకి రక్షణం ప్రత్యక్షం అంటే అది వ్రతసమాప్తి అవుతుంది. మనకి రక్షణం జరగడంలేదు - అంటే మనకి మోక్షం లభించలేదు - అంటే, అది వ్రతభ్రంశమవుతుంది. ఈరెండూ వ్రతియైన భగవానుడికే వెళ్ళి చేరుతాయి. చేతనుడిసంరక్షణం ఈశ్వరుడికి బలం అన్నది దీనివల్లకూడా స్పష్టం అవుతోంది.

ఈయథార్థాన్ని మన ఆచార్యులైన శ్రుతప్రకాశికాచార్యులు, పిళ్ళైలోకాచార్యులవంటివారు మనకి చూపించి కటాక్షించడంలో ఆశ్చర్యం లేదు. భగవానుడే ఈయథార్థాన్ని తన మాటలవల్ల ప్రకాశింపజేసేడు. "*దదామ్యేతత్ వ్రతం మమ*" (శ్రీరామచరమశ్లోకం) అని భగవానుడు చెప్పి ఉండడంవల్ల ఆశ్రితరక్షణం తన వ్రతం అనిన్నీ, దీని ఫలంకూడా ఆయనదే అనిన్నీ ఆయనమాటల్లోనే స్పష్టంగా సాయించబడింది అన్నది మనం గమనించవచ్చు.

"*వినత*" అనే శబ్దం శారీరకశాస్త్రంలో మూడో అధ్యాయం అర్థాన్ని చూపుతుంది. "*రక్షా*" అనే శబ్దం నాలుగో అధ్యాయార్థాన్ని చూపిస్తోంది. "*వినత*" - వంగిన- నమస్కరిస్తున్న - నమస్కారపు క్రమాన్ని - భక్తి మార్గాలే - మూడో అధ్యాయంలో చెప్పబడ్డాయి. నాలుగో అధ్యాయం భక్తికి ఫలమైన మోక్షాన్ని గురించినది. ఈమోక్షమే "*రక్షా*" శబ్దం సూచిస్తోంది. మోక్షప్రదానమే రక్షణం. ఇలా మొదటి రెండు పాదాలవల్లా గ్రంథంలోని వస్తునిర్దేశం చెయ్యబడింది.

మొదటి పాదంవల్ల చూపబడే జగత్కారణత్వం రెండో పాదంతో చూపబడే మోక్షప్రదత్వం ఇవిరెండూ రాజుకి ఛత్రచామరాదుల్లాగ బ్రహ్మానికి ఉన్న అసాధారణమైన చిహ్నాలు. ఇవిరెండూ భగవానుడి పరత్వాన్నీ, సౌలభ్యాన్నీ చూపిస్తున్నాయి. భగవంతుడిని మనం ఆశ్రయించడానికి కారణంగా ఉన్నాయి ఆయన పరత్వం, సౌలభ్యమున్నూ. భగవంతుడు మనచేత ఆశ్రయింపబడే స్వభావంగలవాడుగా ఉన్నాడు. ఈవిధంగా మనచేత ఆశ్రయింపబడే స్వభావానికి నిమిత్తాలుగా పరత్వసౌలభ్యాలు తెలియబడుతున్నాయి. ఆయనకి పరత్వం మాత్రం ఉన్నట్లైతే మనం ఆశ్రయించినందువల్ల ప్రయోజనం లేదు. ఈరెండు గుణాలూ ఆయనదగ్గరచేరి ఉండడంవల్లనే ఆయనకి ఆశ్రయణీయత్వం వస్తోంది. ఈనిజాన్ని ప్రమాణాలు ఎలా తెలియజేస్తున్నాయో తెలుసుకోవాలి.

*"య ఏనం విదురమృతాస్తే భవన్తి"* (ఈవిధంగా ఎవరు ఈయనని తెలుసుకొని ఉపాసిస్తున్నారో వాళ్ళు ముక్తులుగా అవుతారు) అని తైత్తిరీయోపనిషత్తు నారాయణవల్లిలో చెప్పబడింది. ఇక్కడ చెప్పబడే మోక్షప్రదత్వం సౌలభ్యాన్ని చూపుతోంది. ఫలప్రదత్వం ఎలా సౌలభ్యమౌతుంది? అంటే, ఫలప్రదత్వంవల్ల అభిగమ్యత్వం (దగ్గరవడం అనే గుణం) తెలియబడుతోంది. దానివల్లనే ఆయన మోక్షప్రదుడవుతున్నాడు. అభిగమ్యత్వం అనే గుణం ఆయనలో విస్తారంగా ఉండడంవల్ల ఈగుణం సౌలభ్యంగా పరిణమిస్తోందని మనకి తెలుస్తుంది.

*"సం బాహుభ్యాం నమతి సం పతత్రైర్ద్యావాపృథివీ జనయన్ దేవ ఏకః।"* అన్న శ్రుతివాక్యప్రమేయాన్ని మనం తెలుసుకోవాలి. *"**తన నైచ్యాన్ని చూపించి పరుడైనవాడు నీచుడివద్ద నమస్కారాన్ని చేసేవాడిగా అవుతున్నాడు**"* అని అర్థమున్న ఒకస్మృతివాక్యాన్ని ఆధారంగా తీసుకొని *"**పరమాత్మ తనఆశ్రితులవిషయంలో తాను నమస్కరించేవాడుగా అయినాడు**"* అని భావప్రకాశికలో ఈశ్రుతివాక్యానికి అర్థం చెప్పబడింది.

*"సర్వలోకమహేశ్వరం సుహృతం సర్వభూతానాం"* అని గీతావచనం (5-29) *"**భగవానుడు సర్వలోకాలకీ మహేశ్వరుడుగా ఉన్నాడు; సమస్తప్రాణులమీదా మిత్రభావంతో ప్రకాశిస్తున్నాడు, ఇతడిని ఈవిధంగా తెలుసుకొని ఇతనికి ఆరాధనరూపమైన కర్మయోగాన్ని చేసి, ఇతనిని జీవుడు పొందుతున్నాడు.**"* అని యథార్థాన్ని తెలియజేస్తోంది. ఫలప్రదుడైనవాడు సుహృత్తుగా ఉన్నాడు అన్నదానివల్ల ఫలప్రదుడికి ఉండవలసిన సౌలభ్యం చూపబడుతోంది. కనుక, శ్రుతిస్మృతివచనాలని ఆధారంగా తీసుకొని "వినత" అనే శబ్దం భగవానుడి సౌలభ్యాన్ని చూపిస్తోందని మనకి తెలుస్తుంది.

ఇంతవరకూ శారీరకశాస్త్రంతాలూకు స్పష్టమైన అర్థవిశేషాలని మొదటి రెండు పాదాలూ ఎలా సంగ్రహంగా చూపిస్తున్నాయన్నది ఒకవిధంగా అనుభవంలో తీసుకున్నాం. సర్వేశ్వరుడు అఖిలజగత్కారణుడు, సాధ్యమైనభక్తిచేత ఆయనని వశీకరించుకోవడంవల్ల ఆయనే మోక్షోపాయంగా అయినాడు, మోక్షానందాన్ని తనని ఆశ్రయించినవాళ్ళకి ఇచ్చి కటాక్షిస్తున్నాడనే అర్థాలన్నింటినీ అంతర్గతంగా గల రెండుపాదాల ప్రమేయశరీరం బాగా అమిరి ఉన్నది. కాని, వీటన్నింటికీ ప్రమాణం

చూపబడాలిగదా! అనే ప్రశ్న తర్వాత వస్తోంది. ఇలా అపేక్షితమైన ప్రమేయానుగుణమైన ప్రమాణాన్ని చూపించేటట్లు అమిరి ఉన్నదే *"శ్రుతిశిరసివిదీప్తేబ్రహ్మణి శ్రీనివాసే"* అన్న మూడో పాదం.

*"శ్రుతిశిరసివిదీప్తే"* అని సాయించేరు ఎంబెరుమానార్లు. వేదం శ్రుతి అనబడుతుంది. *"శ్రుతి"* అంటే ఏమిటి? *"శ్రూయతే ఇతి శ్రుతిః"* ఎవరిచేతా రచించబడకుండా నిత్యంగా వినిపించబడే వస్తున్నది శ్రుతి అనబడుతుంది. ఇతిహాసపురాణాదులు ఋషులచేత రచింపబడినతర్వాత ఆచార్యశిష్యక్రమంలో నిత్యంగా వినిపించబడి వస్తున్నవి. *"నిత్యశ్రవణం"* అన్నది ఇతిహాసపురాణాదులకి లేదు. వేదం ఒక్కటే *"శ్రూయతే నిత్యం"* అన్నట్టుగా వ్యవహారానికి తగినది. ఒకపురుషుడిచేత రచింపబడకపోవడంవల్ల అపౌరుషేయత్వం అనే గొప్పదనం వేదానికుంది. *"శ్రుతి"* అన్నదానివల్ల వేదానికున్న ఈగొప్పదనం ఇక్కడ వివక్షితం.

*"శ్రుతిశిరసివిదీప్తే"* - *"నిత్యనిర్దిష్టప్రమాణమైన వేదాంతంలో చక్కగా ప్రకాశించేవానియందు"* అని అర్థం. ఇలా వెనుక చూపించబడిన అర్థాలన్నీ అపౌరుషేయమైన శ్రుతిలో చూపబడినటువంటి అర్థాలే కావడంవల్ల వీటిని ఎవరూ కాదనడానికి లేదు.

పూర్వమీమాంసాన్యాయాలు వేదంతాలూకు పూర్వభాగార్థాన్ని నిర్ణయం చేస్తున్నాయి. *"శ్రుతిశిరస్"* అనడంవల్ల నిర్దోషప్రమాణమైన వేదంతాలూకు అర్థనిర్ణాయకాలైన ఈన్యాయాలు ఉపజీవ్యాలన్నది చూపబడుతోంది అంటారు శ్రుతప్రకాశికాచార్యులవారు.

*"శ్రుతిశిరస్"* అని వేదాంతం చెప్పబడుతోంది. *"శ్రుతిశిరస్"* అనడంవల్ల వేదాంతంతాలూకు అనన్యపరత్వమున్నూ, పూర్వభాగపు అన్యపరత్వమూ వివక్షితాలు. అంటే ఉత్తరభాగమైన వేదాంతంకోసమే పూర్వభాగం ఉన్నదనే అర్థాన్ని *"శ్రుతిశిరస్"* అన్నది చూపుతోంది అని మనకి తెలుస్తుంది. ఈవిధంగా విశేషాన్ని దృఢంగా ప్రకాశింపజేసే వేదాంతస్వరూపం ఎలా ఉన్నది అంటే వేదాంతం అనేది మంత్రం, బ్రాహ్మణం అని రెండు భాగాలుగా ఉండి పరతత్త్వమైన బ్రహ్మన్ని గురించి అన్నియథార్థాలనీ మనకి తెలియజేస్తోంది. ఇందులో *"బ్రాహ్మణం"* అనే భాగాన్ని వివరించేటట్లుగా *"మంత్రం"* అనే భాగం. ***బ్రాహ్మణం అనేది వివరణి (వివరింపబడేది). మంత్రం అనేది వివరణం (వివరించేది).*** అంచేత ఇలా వివరణి-వివరణరూపంగా ఉండదగినవే ఉపనిషత్తులు. ఇవి పరతత్త్వంలోనే దృష్టిగలవిగా ఉన్నాయి. పరతత్త్వాన్నే ప్రధానంగా చూపిస్తున్నాయి. అంటే పరతత్త్వాన్ని గురించి వివరణిగానూ వివరణంగానూ ఉండదగినవి ఈఉపనిషత్తులు. అంచేత పరతత్త్వం అన్నది ప్రమేయం. దానికుండే ప్రమాణాలు మంత్రబ్రాహ్మణరూపంగా ఉండే ఉపనిషత్తులు.

*"శ్రుతిశిరసి విదీప్తే"* అనడంవల్ల శ్రుతిశిరస్సైన వేదాంతంలో బాగా ప్రకాశిస్తున్నాడు అని అన్నమాట. *"శ్రుతౌ దీప్తే - శ్రుతిశిరసి విదీప్తే"* అని అర్థం. అంటే రెండుభాగాలుగా ఉన్నటువంటి వేదంవల్ల తెలియజేయబడే భగవంతుడు వేదంలోని పూర్వభాగంలో ప్రకాశిస్తున్నాడనీ, వేదంతాలూకు ఉత్తరభాగమైన వేదాంతంలో బాగా ప్రకాశిస్తున్నాడనీ అర్థం. పూర్వభాగంలో అగ్నీంద్రాదిరూపంగా బ్రహ్మానికే ప్రతిపాద్యత్వం ఉన్నది. ఆయన అందరిలోనూ అంతర్యామిగా లోపలప్రవేశించి నియమించేవాడవడంవల్ల

అందరూ ఆయనకి శరీరాలైన దేవతావాచకశబ్దాలన్నీ ఆయననే తెలియజేస్తున్నాయి. ఇలా ఆయనకి శరీరాలైన దేవతలని చూపించి వాళ్ళద్వారా సర్వాత్మైన పరమాత్మని చూపిస్తోంది పూర్వభాగం. ఇందువల్ల పూర్వభాగంలో ప్రకాశిస్తున్నవాడు ఆయనే అని తేలింది. శ్రుతిశిరస్సైన వేదాంతంలో ఆయన ఇలాకాకుండా ప్రత్యక్షంగా చెప్పబడడంవల్ల ఆయనని వేదాంతంలో బాగా ప్రకాశిస్తున్నవాడిగా చూపిస్తున్నారు ఎంబెరుమానార్లు.

వేదంలోని రెండుభాగాలవల్లా, ప్రతిపాద్యుడుగా ప్రకాశించేవాడు పరమాత్మయే. పూర్వభాగంలో శరీరాలైన ఇంద్రాదిదేవతావాచకశబ్దాలమూలంగా ప్రకాశిస్తున్నాడు. ప్రత్యక్షంగా స్వరూపస్వభావాలు ప్రతిపాదింపబడి ఆయన బాగా విశేషింపబడి ప్రకాశించేది బ్రహ్మభాగమనే ఉపనిషత్తులలోనే అని అర్థం తోపించే *"శ్రుతిశిరసివిదీప్తే"* అన్నదానికి పూర్వభాగంలో ఒక అర్థాన్నీ, ఉత్తరభాగంలో మరో అర్థాన్నీ వ్యాఖ్యాత చూపిస్తున్నారు.

పూర్వభాగంలో స్వర్గాదిభోగాలు చెప్పబడి ఉన్నాయి. ఇవన్నీ క్షుద్రఫలాలు. వీటికి సాధనాలుగా ఉన్నవి దుఃఖాత్మకాలైన ప్రవృత్తినివృత్తిరూపమైన ప్రయోజనాలు. మీమాంసకులు ప్రవృత్తినివృత్తులనే ప్రయోజనాలుగా తీసుకున్నారు. కాని ఉత్తరభాగమైన వేదాంతంలో చెప్పబడేదైతే పరమపురుషార్థమైన మోక్షం. బ్రహ్మమనేదే నిరతిశయానందరూపమై - ఆనందమయమై - ఉన్నది. ఇదే పరమపురుషార్థం. ఇలా నిరతిశయానందస్వరూపుడైన పరమపురుషార్థమైన భగవానుడు వేదాంతంలో మిక్కుటంగా ప్రకాశిస్తున్నాడు అంటే, పూర్వభాగంలోలాగ కాకుండా ఈఉత్తరభాగంలో అత్యున్నతమైన పురుషార్థం చూపబడుతున్నట్టు అయింది. పూర్వభాగంలో సాతిశయ (పరిమితమైన) పురుషార్థం చూపబడింది. ఉత్తరభాగమైన వేదాంతంలో నిరతిశయానందరూపమైన పరమపురుషార్థం చూపబడుతోందని మనం గమనించవచ్చు.

*"శ్రుతిశిరసి విదీప్తే"* - ఇక్కడ **సమన్వయాధికరణం** (1-1-4) సూచితమంటున్నారు వ్యాఖ్యాత. *"తత్తు సమన్వయాత్"* (1-1-4)అని సూత్రం. ***తత్*** అన్నది సర్వనామశబ్దం. ***శాస్త్రయోనిత్వాధికరణంలో*** (1-1-3) *"శాస్త్రయోనిత్వాత్"* (1-1-3)అన్న సూత్రంలో చెప్పబడిన అర్థాన్ని ఇక్కడున్న "***తత్***" శబ్దం **పరామర్శిస్తోంది**. శాస్త్రం ఒక్కదానివల్లనే బ్రహ్మాన్ని గురించి మనం తెలుసుకోగలం. బ్రహ్మం శాస్త్రంవల్లనే తెలుసుకోదగినది అనే అర్థాన్ని చూపేది శాస్త్రయోనిత్వాధికరణం. *"సమన్వయాత్ - పురుషార్థత్వేన వేదాన్తవాక్యానాం బ్రహ్మణి అన్వయాత్"* అని అర్థం. బ్రహ్మమనేది పరమపురుషార్థంగా శాస్త్రంవల్ల చక్కగా ప్రతిపాదింపబడిందిగనుక, ఆవిషయంలో శాస్త్రం ప్రమాణమే. బ్రహ్మనికుండే శాస్త్రప్రమాణకత్వం శాస్త్రవేద్యత్వం ఇక్కడ మనకి తెలుస్తోంది. పరమపురుషార్థంగా బ్రహ్మాన్ని వేదాంతం ప్రతిపాదించడంవల్ల బ్రహ్మవిషయంలో అది (వేదాంతం) చక్కగా అన్వయిస్తోంది. దానివల్ల బ్రహ్మనికి శాస్త్రప్రమాణకత్వం (శాస్త్రంవల్ల తెలియబడే స్వభావం) సిద్ధిస్తోంది.

పరమపురుషార్థంగా వేదాంతం బ్రహ్మని ప్రతిపాదిస్తోందంటే, ఇక్కడ ఏదో ఒక ఆక్షేపం నిరసింపబడుతోందని తోస్తుంది. ఈఅధికరణంలో చెప్పబడే పూర్వపక్షం ఏమిటన్నది గమనించతగింది. ఇక్కడ మీమాంసకులు పూర్వపక్షులు.

<u>పూర్వపక్షం</u>: పురుషార్థాలని చెప్పడానికి వచ్చింది శాస్త్రం. బ్రహ్మం శాస్త్రంవల్లనే తెలియబడేదిగా ఉన్నా, దానిగురించిన విచారం చేసి, దాన్ని తెలుసుకుంటే ఏమీ ప్రయోజనం లేదు. బ్రహ్మం ఒక సిద్ధవస్తువు అనడంవల్ల అది ఒక నిష్ప్రయోజనమైన తత్త్వం. సిద్ధవస్తువు అన్నది ప్రయోజనరూపమై ఉండదు. ప్రవృత్తిగాని, నివృత్తిగాని ప్రయోజనానికి సాధనంగా ఉండవచ్చు. దానివల్లనే పురుషార్థానికి సాధనంగా ఉండతగిన ప్రవృత్తి నివృత్తులని బోధించే వాక్యాలే మనకి ప్రయోజనపర్యవసానాలు (ప్రయోజనంగా చివరికి ఉండగలిగేవి). ఈప్రవృత్తినివృత్తులు ప్రయోజనాలు. దాన్ని తెలిపే వాక్యాలు ప్రయోజన పర్యవసానాలు. ఇలాకాకుండా, ఉపనిషత్తులన్నీ సిద్ధవస్తువైన బ్రహ్మనిగురించి బోధిస్తున్నాయి. సిద్ధవస్తువనేది ప్రవృత్తీగాదు, నివృత్తీగాదు. ప్రవృత్తినివృత్తిరూపత్వం లేదంటే సిద్ధవస్తువైన బ్రహ్మనికి ప్రయోజనత్వం లేదు. అంచేత దానిగురించి తెలిపే ఉపనిషద్వాక్యాలకి ప్రయోజనపర్యవసాయిత్వం లేదు. ఎంతో కాలం కష్టపడి అధ్యయనం చేసి, తర్వాత అర్థవిచారం చేసీ అది ఒకప్రయోజనంగాలేదు అంటే దాన్నిగురించిన విచారంవల్ల ఏంలాభం? ఒక్కలాభమైనా లేదుగనుక, బ్రహ్మన్ని గురించిన విచారం అవశ్యంగాదు అని పూర్వపక్షం.

***<u>సిద్ధాంతం:</u>*** బ్రహ్మం అనేది ప్రవృత్తినివృత్తిరూపంగాదు అన్నది నిజమే. కాని బ్రహ్మమనేది అపరిచ్ఛిన్నమైన ఆనందస్వరూపమై ఉండడంవల్ల అదే స్వయంపురుషార్థం అవుతోంది. కనుక, ప్రవృత్తినివృత్తిరూపం లేకపోయినా, దానికి పురుషార్థతత్త్వం లేదనడం కుదరదు. బ్రహ్మమే స్వయంపురుషార్థం అంటే బ్రహ్మనిగురించి తెలియజేసే వేదాంతవాక్యాలే బాగా ప్రయోజనపర్యవసానాలు అవుతున్నాయి. అంచేత ఈ వేదాంతవాక్యాలు బ్రహ్మవిషయంలో చక్కగా అన్వయం అవుతున్నాయి.

*"నిధిపోలే బ్రహ్మమే స్వయంప్రయోజనరూపం; తత్ప్రతిపాదక వేదాన్తవాక్యఙ్గళే సాక్షాత్ప్రయోజన పర్యవసాయిగళ్; ఇష్ట-అనిష్టప్రాప్తి పరిహారసాధనబోధనద్వారా ప్రవృత్తినివృత్తిపరవాక్యఙ్గళుక్కు ప్రయోజన పర్యవసాయిత్వమే యొఴ్ఴియ నేరే ప్రయోజనపర్యవసాయిత్వమిల్లై. ఆగైయాల్ అనన్తకల్యాణగుణ పరిపూర్ణ మాన బ్రహ్మమే ప్రయోజనమాయ్ తత్ప్రతిపాదకమాన శాస్త్రమ్ ప్రమాణమాయ్ సిద్ధిక్కైయాలే, సిద్ధబ్రహ్మప్రతిపాదకమాన శాస్త్రమ్ ఆరమ్భణీయమ్ ఎన్నిఱే సమన్వయాధికరణత్తిన్ పొరుళ్."* - (నిధిలాగ బ్రహ్మమే స్వయంప్రయోజనరూపం. అలా ప్రతిపాదించే వాక్యాలే సాక్షాత్తూ ప్రయోజనంగా పర్యవసాయం గలవి. ఇష్టప్రాప్తి, అనిష్ట నివృత్తికీ సాధనాన్ని చెప్పడంద్వారా ప్రవృత్తి నివృత్తిపరమైన వాక్యాలకి ప్రయోజనంలో పర్యవసించే గుణమేతప్ప మరో ప్రయోజనంగామారే గుణంలేదు. కనుక ఆయాకల్యాణ గుణాలచేత పరిపూర్ణమైన బ్రహ్మమే ప్రయోజనమై దాన్ని ప్రతిపాదించే శాస్త్రం ప్రమాణంగా సిద్ధించడంవల్ల సిద్ధమైన బ్రహ్మను ప్రతిపాదించేదైన శాస్త్రం ఆరంభించతగినదేనని సమన్వయాధికరణంతాలూకు అర్థం) అని ఒకమహాపురుషుడు సమన్వయాధికరణప్రమేయాన్ని సంగ్రహంగా చెప్పేరు.

బ్రహ్మం పరమపురుషార్థంగా ఉండడంవల్లనే వేదాంతవాక్యాలు ప్రమాణభావాన్ని పొందుతున్నాయ్ అనే ఈఅర్థం *"శ్రుతిశిరసివిదీప్తే"* అనడంవల్ల సూచింపబడుతోందని మనం ఇలా తెలుసుకోవచ్చని చూపిస్తున్నారు వ్యాఖ్యాత. *"విదీప్తే"* అన్నదానికి ***"బ్రహ్మం నిరతిశయఆనందరూపమై ఉండడంవల్ల***

***పరమపురుషార్థంగా ప్రకాశిస్తోంది"*** అని అర్థం వస్తోంది. సమన్వయాధికరణంలాగే దానికి ముందున్న మూడధికరణార్థాలూ ***"శ్రుతిశిరసివిదీప్తే"*** అన్నదానివల్ల సూచింపబడుతున్నాయన్న విషయాన్నికూడా మనం గమనించవచ్చు.

మొదటి అధికరణం జిజ్ఞాసాధికరణం. ఈఅధికరణంలో ***"అథాతో బ్రహ్మజిజ్ఞాసా"*** అన్నది సూత్రం. ***"కర్మని గురించిన నిశ్చయబుద్ధీ, బ్రహ్మనిగురించిన ఆపాతప్రతీతీ కలిగినవాడు బ్రహ్మనిగురించిన విచారం చెయ్యతగినవాడు."*** అన్నది ఈసూత్రంలో తెలియజెయ్యబడిన అర్థం.

***పూర్వపక్షం***:- కర్మం సిద్ధవస్తువుకాకపోవడంవల్ల అది మన ప్రయత్నసాధ్యం. దాన్నిగురించి కావాలంటే నిశ్చయబుద్ధి తెచ్చుకోవచ్చు. దాన్ని గురించి వేదం తెలియజేస్తోంది అంటే, దానికి ప్రమాణభావం ఉన్నది. బ్రహ్మం అనేది సిద్ధవస్తువై ఉండడంవల్ల దాన్నిగురించి విచారించడమే కుదరదు. అని పూర్వపక్షం. ఎంచేతంటే, సిద్ధవస్తువుగురించి (మొదట) జ్ఞానమే కలగదు. బ్రహ్మనిగురించి ఆపాతప్రతీతి వస్తేనే దాన్నిగురించివిచారించడం సాధ్యంగదా?

ఈవాదాన్ని కొంచెం వివరంగా చూద్దాం. మేక, పశువు, పుస్తకం, మంచం వంటివి సిద్ధవస్తువులు. ఇటువంటి సిద్ధవస్తువులనిగురించి చెప్పబడిన శబ్దాలు దేన్ని చెప్తున్నాయి అన్న నిర్ణయమే కలగదు. ఈవస్తువులు కార్యంలో ఉపయోగపడడంవల్ల దాన్ని సూచించడం కావాలిగనుక జ్ఞానం కలుగుతుంది. కాని కేవలం సిద్ధవస్తువునిగురించి చెప్పినప్పుడు మొదటిజ్ఞానం కలగదు. సిద్ధవస్తువునిగురించి జ్ఞానమే కలగదు అని చెప్పలేదు. కాని అవి కార్యంలో ఉపయోగపడిన తర్వాతనే జ్ఞానం కలుగుతుంది. ఉదాహరణకి - మంచం అనే పదార్థాన్ని తీసుకున్నాం. ఇది మనకి తెలిసిన వస్తువే. కాని దీన్ని మనం మంచం అనే తెలుసుకున్నాం. దీనికి చైనాభాషలో ఒకపేరుంటుంది. అది మనకి తెలియదు. చైనాభాషలో మంచాన్ని గురించి ఒకడు చెప్తే అతను చెప్పినదే కారణంగా వాడు చెప్పినది మంచాన్ని గురించి చెప్తోందనే జ్ఞానం మనకి కలుగదు. ఇదే మంచాన్ని గురించి చైనాభాషలో ఒక వ్యాకరణవాక్యాన్ని చెప్పి దానికి అనుగుణంగా మరొకడు మంచం అనే పదాన్ని ఉపయోగించినందువల్ల దాన్ని చూసి "ఈమంచాన్నే ఆచీనాభాషలోని పదం చెప్తోంది"అని మనం తెలుసుకుంటాం. దీనివల్ల ఒక కార్యంలో వినియోగపడినప్పుడే ఆయా సిద్ధవస్తుబోధకశబ్దాలు నిర్ణీతాలై ఉన్నాయన్నవిషయం తెలుస్తుంది. నిర్ణీతమైతేనే జ్ఞానం కలగడానికిసాధ్యం అవుతుంది. కార్యంలో ఉపయోగపడని సిద్ధవస్తువునిగురించిన మొదటి జ్ఞానంకలుగదు. ఇలా సిద్ధవస్తువైన బ్రహ్మంగురించి శబ్దం బోధించదు అని పూర్వపక్షం.

***సిద్ధాన్తం.***:-- కార్యంలో ఉపయోగపడనప్పటికీ సిద్ధవస్తువునిగురించిన జ్ఞానం కలగడానికి సాధ్యమే. ఉదాహరణంగా మనం ఒక పిల్లడికి ఎన్నో సిద్ధవస్తువులని చూపించి "ఇది చంద్రుడు, ఇది పుస్తకం" అంటూ చెప్పి వాటిని గురించిన జ్ఞానాన్నికలిగిస్తున్నాం. దీనివల్ల అంగుళినిర్దేశం చెయ్యడంద్వారా సిద్ధవస్తువుని తెలియజేసే వాక్యాలవల్లకూడా సిద్ధవస్తువులనిగురించిన జ్ఞానం కలిగుతోంది అన్నది స్పష్టం. ఇదేవిధంగా వేదాంతవాక్యాలుకూడా సిద్ధవస్తువైన బ్రహ్మన్నిగురించిన యథార్థాలని ఎన్నోవిధాలుగా చెప్పి, దానిగురించిన జ్ఞానాన్ని మనకి కలిగించవచ్చు. బ్రహ్మవిషయంగా వ్యుత్పత్తి కలగవచ్చుగనుక దానిగురించిన

విచారం చెయ్యతగినదే.

దీనికి తరువాతిదైన జన్మాద్యధికరణంలో బ్రహ్మవిచారాన్ని ఆక్షేపించే మరో పూర్వపక్షం నిరసించబడుతోంది. బ్రహ్మనిగురించిన వ్యుత్పత్తి ఎలా చూసినా దానికి లక్షణపూర్వంగా వ్యుత్పత్తి రావాలి. ఒకవస్తువునిగురించి కొత్తగా తెలుసుకొనాలంటే, దాని లక్షణాన్ని మొదట తెలుసుకొనిఉండాలి. బ్రహ్మనికి లక్షణం చెప్పసాధ్యంగాదు. లక్షణంచేత తెలిసే జ్ఞానం బ్రహ్మవిషయంలో సిద్ధించదు. ఇలా ఆక్షేపం వస్తే, దానికి బ్రహ్మలక్షణాన్ని తెలిపేదిగా

*"యతో వా ఇమాని భూతాని జాయన్తే । యేన జాతాని జీవన్తి। యత్ ప్రయన్త్యభిసంవిశన్తి । తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి॥"* (తై. భృగువల్లి) (దేనినుంచి ఈలోకాలు సృష్టింపబడుతున్నాయో, పుట్టినవి దేనివల్ల జీవిస్తున్నాయో, బతికినవి ప్రళయంలో దేనిని పొందుతున్నాయో దానిని తెలిసికొనవలెను. అదే బ్రహ్మము.) అనే వేదవాక్యం ఎత్తుకోబడింది. ఈఅధికరణానికి ఇదే విషయవాక్యం. ఈవాక్యంలో చెప్పబడ్డ జగజ్జన్మాదికారణత్వం బ్రహ్మనికి లక్షణంగా కాలేదన్నది పూర్వపక్షం.

ఉపలక్షణాకారం, ఉపలక్ష్యాకారం, పూర్వప్రతిపన్నాకారం అని మూడు విషయాలు మొదట తెలియాలి. బ్రహ్మం ఇక్కడ ఉపలక్ష్యం. అంటే తెలియజేయబడేది. తెలియజేయబడేవస్తువేదో, దానికి బాహ్యంగా ఉండి దాన్ని తెలియజెయ్యడానికి ఉపాయంగా ఉన్నది ఉపలక్షణం. ఒక లక్షణంలో లక్ష్యంగురించికలిగే జ్ఞానంలో ఈలక్షణంకూడా తప్పకుండా విషయం అవుతుంది అన్ననియమంలేకుండా ఉంటే అది ఉపలక్షణం. విశేష్యంలోనే (తెలియజేయబడే వస్తువులోనే) ఉంటూ దాన్ని తెలియజెయ్యగల ఉపాయమై ఉన్నది విశేషణం. ఒకపదార్థంలోనే ఎప్పుడూ ఉంటూ, ఆపదార్థాన్ని చూపించేది విశేషణం అనబడుతుంది. జ్ఞాప్యార్థభూతమై, ఉంటూ, జ్ఞాప్యప్రతీతి ఉపాయమై ఉన్నది విశేషణం. రెండు చెట్టుకొమ్మలమధ్యన కనబడే చంద్రుడిని చిన్నపిల్లడికి చూపిస్తాం. ఇక్కడ చంద్రుడిని చూపించే చెట్టుకొమ్మలు ఉపలక్షణాలు. వేలాడుతూండే గంగడోలు పశువుకి విశేషణం.

లక్షణం అనేది ఉపలక్షణంగా ఉండడమేనా ఉండాలి లేదా, విశేషణంగా ఉండాలి. జగజ్జన్మాదికారణత్వం అనేది ఉపలక్షణమై (జ్ఞాప్యబహిర్భూతమై) ఉండాలి లేదా, విశేషణమై (జ్ఞాప్యాంతర్భూతమై) ఉండాలి. కాని ఈరెండువిధాలుగానూ లేనిదికావడంతో ఇది (జగజ్జన్మాదికారణత్వం) బ్రహ్మనికి లక్షణంగా కాలేదు అని ఆక్షేపం.

**పూర్వపక్షం;--** జగజ్జన్మాది కారణత్వం బ్రహ్మనికి విశేషణంగా ఉండలేదనే వాదాన్ని మొదట చూద్దాం. జగజ్జన్మాదికారణత్వం బ్రహ్మలక్షణం అని అంగీకరిస్తే, జగదుత్పత్తికారణత్వం, స్థితికారణత్వం, లయకారణత్వం అని బ్రహ్మనికి మూడు విశేషణాలు సిద్ధిస్తున్నాయి. *"విశేషణభేదాత్ విశేష్యభేదః"* అనే న్యాయంవల్ల విశేషణాలు అనేకంగా ఉన్నప్పుడు విశేష్యంకూడా అనేకాలుగా ఉంటుంది (మనకి ఇక్కడ ఒక విశేష్యమే వివక్షితం) అన్నదానివల్ల, జగజ్జన్మాదికారణత్వాన్ని ఇక్కడ బ్రహ్మనికి విశేషణంగా చెప్పసాధ్యంగాదు.

జగజ్జన్మాదికారణత్వం ఉపలక్షణంగా ఉండాలి అంటే మూడో ఆకారమైన పూర్వప్రతిపన్నాకారం (ముందుగానే తెలిసున్న ఒక అంశం) ఉండి ఉండాలి. ఇక్కడ ఉపలక్ష్యం బ్రహ్మం. ఉపలక్షణం జగజ్జన్మాది కారణత్వం. ముందరే బ్రహ్మం తెలిసుండడంవల్ల జగజ్జన్మాదికారణత్వం ఉపలక్షణంగా ఉన్నది అని అంగీకరించవచ్చు. కాని, స్థూలప్రతిపన్నాకారం ఒక్కటే లేదు బ్రహ్మానికి. బ్రహ్మం ప్రత్యక్షవేద్యంగాదు. బ్రహ్మం శాస్త్రైకసమధిగమ్యం. *"సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ"* అనే వాక్యంలో చెప్పబడ్డట్టుగా సత్యత్వ, జ్ఞానత్వ అనంతత్వాలని పూర్వప్రతిపన్నాకారాలుగా తీసుకోసాధ్యంగాదు. ఎంచేతంటే, ఈసత్యత్వ జ్ఞానత్వ, అనంతత్వాకారాలు ఉపలక్షణాలా లేక విశేషణాలా అన్న ప్రశ్న వస్తుంది. ఉపలక్షణాలుగా వీటిని తీసుకుంటే, ఆతర్వాత వీటికి పూర్వప్రతిపన్నాకారాలు ఏవి అన్న ప్రశ్న వస్తుంది. ఇలా ఒకదానికొకటిగా చివరలేకుండా చెప్పానే రావలసివస్తుంది. అంచేత అనవసాదదోషం ప్రసంగిస్తుంది. జగజ్జన్మాదికారణత్వాన్నే ఇక్కడ పూర్వప్రతిపన్నాకారంగా తీసుకుంటే, అన్యోన్యాశ్రయత్వదోషం వస్తుంది. వీటిని విశేషణాలుగా తీసుకుంటే, *"విశేషణభేదాత్ విశేష్యభేదః"* అనే న్యాయాన్ని ఇక్కడకూడా తీసుకోవలసివస్తుంది. కనుక జగజ్జన్మాది కారణత్వాన్ని ఉపలక్షణంగాకాని, విశేషణంగాకాని తీసుకోవడం కుదరదు.

పైగా, ఈమూడు విశేషణాలూ, కలిసి ఒకబ్రహ్మాన్ని చూపిస్తున్నాయని తీసుకోవచ్చుగదా అంటే, అదీ కుదరదు. బ్రహ్మం అనేది ప్రత్యక్షంవల్లో, లేక మరో ప్రమాణంవల్లో "ఒకటే" అని తెలియజెయ్య బడలేదు. పైగా, విశేషణం అంటే ఏమిటి? విశేషణం అంటే, వ్యావర్తకం అని అర్థం. ఇతరవిశేషణయుక్తమైన ధర్మినుంచి తన(తాను ఏధర్మికి విశేషణమై ఉన్నదో ఆ)ధర్మిని వేరుచేసేది విశేషణం అనబడుతుంది. లౌకికవ్యవహారాలు ప్రత్యక్షప్రమాణసిద్ధాలు గనుక ఎన్నో విశేషణాలు కలిసి ఒక విశేష్యాన్ని చెప్పవచ్చు - అంటే ప్రత్యక్షంవల్ల ఆవిశేష్యం ఒకటిగా తెలిస్తే అలా చెప్పవచ్చు. బ్రహ్మం ప్రత్యక్షవేద్యంగాదు. బ్రహ్మాన్ని గురించి శబ్దంఒక్కదానివల్లనే తెలుసుకోవాలి. బ్రహ్మాన్నిగురించి తెలుసుకోవడానికి మరి ప్రమాణాలు లేవు. శబ్దం జగజ్జన్మాదికారణత్వరూపేణా అనేకవిశేషణయుక్తమైన బ్రహ్మాన్ని చూపిస్తోంది అంటే అనేక బ్రహ్మాలు సిద్ధిస్తాయి. విశేషణభేదప్రయుక్తమైన విశేష్యభేదాన్ని మనం లేదనడానికి కుదరదు. ఇలా జగజ్జన్మాదికారణత్వమైన మూడు విశేషణాలవల్లామనకి వివక్షితమైన ఒక బ్రహ్మం సిద్ధించదు. కనుక, జగజ్జన్మాది కారణత్వాన్ని బ్రహ్మకి ఉపలక్షణత్వపద్ధతిలోనో, లేక విశేషణత్వపద్ధతిలోనో లక్షణంగా చెప్పసాధ్యంగాదు. ఇందువల్ల బ్రహ్మవిచారం ఆరంభణీయంగాదు అని స్పష్టం అవుతోంది.

<u>సిద్ధాంతం.</u> ***"బ్రహ్మానికి జగజ్జన్మాదికారణత్వం ఉపలక్షణత్వాదిపద్ధతిలోనూ, విశేషణపద్ధతిలోనూ కూడా చెప్పుకోవచ్చు"*** అన్నదే సిద్ధాంతం. మొదట జగజ్జన్మాది కారణత్వం బ్రహ్మానికి ఎలా ఉపలక్షణం అయింది అన్నదాన్ని నిరూపిస్తాం. బ్రహ్మానికి పూర్వప్రతిపన్నఆకారమే లేదు అనేపక్షం కుదరదు. బ్రహ్మానికి పూర్వప్రతిపన్నాకారం ఉన్నది. *"సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ"* అన్నవాక్యాన్ని ఇక్కడ ఎత్తుకోకూడదు. ఎంచేతంటే, ఇక్కడ బ్రహ్మం అన్నది ఉపలక్ష్యంగాదు. నిరతిశయబృహత్వయుక్తమైన తత్త్వమే ఉపలక్ష్యం. *"యతోవా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి॥"* అన్న వాక్యంలో ఉన్న *"యత్"* శబ్దం ప్రసిద్ధిని చూపిస్తోంది. పూర్వం (ఇదివరకే) తెలియబడినదాన్ని ఈ *"యత్"* శబ్దం నిర్దేశిస్తోంది. కనుక, ఈవాక్యమే మొట్టమొదట మనకి బ్రహ్మాన్ని తెలియజేస్తోందనిగాదు. మరో వాక్యం బ్రహ్మాన్ని ఇదివరకే తెలియజేసిందన్నదాన్ని ఈ*"యత్"* శబ్దం

చూపిస్తోంది. *"యతో వా ఇమాని భూతాని జాయన్తే"* (దేనినుండి ఈభూతములు సృష్టింపబడ్డాయో) అని ఇదివరకే తెలియబడిన బ్రహ్మవిషయంగా ఈభూతముల ఉత్పత్తిని చెప్తోంది ఈవాక్యం. ఇక్కడ బ్రహ్మతాలూకు ఉపాదానకారణత్వాన్ని అనువాదంచేస్తోంది. దీనివల్ల బ్రహ్మం జగత్తుకి నిమిత్త, ఉపాదాన కారణం అని ముందరే ఒక వాక్యంవల్ల తెలియజేయబడింది అని తెలుస్తోంది. ఆవాక్యమే బ్రహ్మన్ని గురించి మొదట్లో తెలియజేసిన వాక్యం. అదే విశేష్యమైన బ్రహ్మంతాలూకు పూర్వప్రతిపన్న ఆకారాన్ని తెలియజేస్తోంది. *"సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్"* (ఛాం. 6-2-1) ఇత్యాదివాక్యాలే ఇలా బ్రహ్మంతాలూకు జగజ్జన్మాది కారణత్వాన్ని ఇదివరకే తెలియజేసిన వాక్యాలు. ఇలా ఇదివరకే తెలియజేయబడిన జగజ్జన్మాది కారణత్వాన్ని అనువాదం చేసినదే *"యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి॥"* అన్నవాక్యం. *"సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్"* (ఛాం. 6-2-1) అన్న వాక్యం ఉపాదానకారణత్వానికి ఉండాల్సిన సర్వశక్తియోగాన్ని, నిమిత్తకారణత్వానికి ఉపయుక్తమైన సర్వజ్ఞత్వాన్నీ మనకి చూపిస్తోంది. ఈవాక్యంవల్ల సర్వజ్ఞ మై, సర్వశక్తిమంతమైనదిగా, ఇదివరకే తెలియజేయబడింది బ్రహ్మం. ఇదే పూర్వప్రతిపన్న ఆకారం. జగజ్జన్మాదికారణత్వం అన్నది ఉపలక్షణ ఆకారం. నిరతిశయబృహత్వం అన్నది ఉపలక్ష్యం. *"యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి॥"* అన్నవాక్యంలో బ్రహ్మశబ్దం లేదు. బ్రహ్మశబ్దానికి ప్రవృత్తినిమిత్తం బృహత్వం. **"నిరతిశయబృహత్తైన తత్త్వం ఇది"** అని *"యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి॥"* అన్న ఈవేదవాక్యం మనకి చూపిస్తున్నదనే మనకి తెలుస్తుంది.

ఇక తరువాత జగజ్జన్మాదికారణత్వాన్ని బ్రహ్మనికి విశేషణంగాకూడా తీసుకోవచ్చన్నది నిరూపించ బడుతుంది. *"విశేషణభేదాత్ విశేష్య భేదః"* అన్నది కుదరదు. విశేష్యం ఒక్కటే అని చెప్పకుందికి ప్రత్యక్షం లేదు అన్నప్పటికీ, విశేష్యం ఒకటిగా ఉండవచ్చన్నదిమనకి తెలుసు. ఎలా అంటే, ఒకవిశేష్యానికి ఉండే ఎన్నో విశేషణాలు ఒకదానికొకటి వ్యతిరేకం కాకపోతే, ఈసమస్తవిశేషణాలూ కలిసి ఒక విశేష్యాన్ని చూపించడం సాధ్యమే. ఎన్నో విశేషణాలున్నప్పుడు అవి ఒకదానితో ఒకటి విరోధం ఉన్నవైతే విశేష్యం అలా ఒకటిగా తేలడం సాధ్యంగాదు. అనేకంగానే ఉండాలి. ఈయథార్థాన్ని తెలుసుకోవడానికి మనకి ప్రత్యక్షం అవసరంలేదు. విశేష్యాన్నిగురించి విశేషణాలు ఎలా అమిరిఉన్నాయి, - ఏఅర్థాలని చూపిస్తున్నాయి - అన్నదాంతోటే విశేష్యం ఒకటా లేక అనేకమా అన్నది మనం నిశ్చయించవచ్చు.

దీన్నిబట్టి చూస్తే, జగత్కారణత్వం, స్థితికారణత్వం, లయకారణత్వం అన్న మూడు విశేషణాలూ విశేష్యమైన బ్రహ్మనికి తగిఉన్నవే అని స్పష్టం. ఎంచేతంటే, ఇవి ఒకదానికి ఒకటి విరుద్ధవిశేషణాలుగావు. బ్రహ్మనికి ఎప్పుడు సృష్టికారణత్వం ఉన్నదో, అప్పుడు స్థితి, లయ,-కారణత్వాలు లేవు. బ్రహ్మనికి ఎప్పుడు స్థితికారణత్వం ఉన్నదో అప్పుడు సృష్టి, లయ కారణత్వాలు లేవు. బ్రహ్మనికి ఎప్పుడు లయకారణత్వం ఉన్నదో అప్పుడు సృష్టి, స్థితికారణత్వాలు లేవు. కాలభేదంవల్ల ఈఆకారాలు ఒకదానికొకటి విరుద్ధంకానివిగా బ్రహ్మనికి విశేషణాలుగా తగినవిగానే ఉన్నాయి. అంచేత, విశేషణభేదాలు విశేష్యభేదాన్ని చూపించే ఉంటాయనిగాదు. ఎక్కడెక్కడ అన్ని విశేషణభేదాలు ఒకదానికొకటి విరుద్ధాలై ఒకే వ్యక్తికి అన్వయించడానికి కుదరదో అక్కడక్కడమాత్రం విశేష్యభేదం సిద్ధిస్తుంది. కనుక

ప్రత్యక్షపరోక్షాలు నియామకాలుగావు. ప్రత్యక్షం విశేష్యభేదాన్ని చూపించవచ్చు, విశేష్యఅభేదాన్నీ చూపించవచ్చు. పరోక్షంకూడా, ఈరెండింట్లోనూ ఏది కావాలన్నా చూపవచ్చు. విశేషణాలు పరస్పరం విరుద్ధాలుగా ఉంటే, అవి ఒకేవిశేష్యంలో అన్వయించుకోవడం కుదరదు. విశేషణాలు పరస్పర అవిరోధాలైనప్పుడు అవి ఒకే విశేష్యంలో అన్వయించుకోవచ్చు. విశేషణాల్లో ఉన్న విరుద్ధత్వావిరుద్ధత్వాలే నియామకాలు. దీనివల్ల సృష్టి, స్థితి,లయకారణత్వాలు కాలభేదంవల్ల పరస్పరం అవిరోధాలుగనుక, అవి విశేష్యమైన బ్రహ్మానికి తగినవే అని నిరూపించడం జరిగింది. జగజ్జన్మాది కారణత్వం అనేది ఉపలక్షణంగానూ, విశేషణంగానూ బ్రహ్మానికి లక్షణంగా కుదరడంవల్ల ఈలక్షణంతో బ్రహ్మాన్ని తెలుసుకోవడం సాధ్యం. కనుక, బ్రహ్మవిచారం చేయతగినదే అన్న సిద్ధాంతంకూడా నిరూపితమైంది.

తరువాతి అధికరణం ***శాస్త్రయోనిత్వాధికరణం.*** జగజ్జన్మాదికారణత్వం బ్రహ్మలక్షణం అన్నది అనుమానప్రమాణంవల్ల సిద్ధించినా, ఇతరప్రమాణాలవల్ల తెలుసుకోబడనిదాన్నే శాస్త్రం చూపించడంవల్లా, బ్రహ్మవిషయంలో శాస్త్రం ప్రమాణం కాలేదు. అంచేత బ్రహ్మవిచారం అనారంభణీయం అని పూర్వపక్షం. ఎలా కార్యవస్తువైన ఘటంలోంచి దానికి కర్త ఒకడు ఉంటాడని అనుమానంవల్ల తెలియబడుతోందో, అలాగే కార్యవస్తువైన ఈజగత్తుకికూడా కారణంగా బ్రహ్మం ఉన్నదని తెలియబడుతుంది అనడంవల్ల బ్రహ్మానికి జగత్కారణత్వం అనుమానంవల్ల సిద్ధిస్తోంది అన్నది పూర్వపక్షం.

సిద్ధాంతంలో వెనుక చూపబడిన అనుమానం బ్రహ్మవిషయంలో ప్రమాణం కాజాలదని చూపించబడి, శాస్త్రం మాత్రం బ్రహ్మవిషయంలో ప్రమాణం అవుతుంది అని నిరూపించబడుతోంది. *"శాస్త్రయోనిత్వాత్"* అని సూత్రం. ***"శాస్త్రం ఒక్కటే బ్రహ్మని గురించిన జ్ఞానానికి కారణమై (ప్రమాణమై) ఉన్నది"*** అని ఈసూత్రానికి అర్థం. ఇక బ్రహ్మవిషయంలో అనుమానప్రమాణానికుండే దోషాలు ఏవి అన్నది చూద్దాం.

అనుమానప్రమాణమంటే లోకదృష్టాంతాన్ని ఆధారంగా తీసుకున్నది. పూర్వపక్షంలో ఘటం, ఘటానికి కారణమైన కులాలుడు (కుమ్మరివాడు) ఇవి వరుసగా కార్యవస్తువైన జగత్తుకి దానికి కారణమైన బ్రహ్మానికీ దృష్టాంతంగా ఎత్తుకోబడ్డాయి. ఇవి రెండూ జగత్తుకి బ్రహ్మానికీ దృష్టాంతం కాలేవు అన్నదాన్ని మొదట చూద్దాం. లోకంలో కనబడేఎటువంటి కార్యపదార్థానికైనా, నిమిత్త ఉపాదాన కారణాలు వేరువేరుగానే చూడబడుతున్నాయి. కాని జగత్తుని కలిపేంతవరకూ బ్రహ్మమే జగత్తుకి అభిన్ననిమిత్తోపాదానకారణంగా చూడబడుతోంది. వేదాంతం బ్రహ్మని త్రివిధ(నిమిత్త, ఉపాదాన, సహకారి)కారణంగా చూపుతోంది. ఇది శాస్త్రంవల్లమాత్రమే తెలిసే యథార్థం. అనుమానం కులాలసదృశంగా(కుమ్మరివాడిగా) బ్రహ్మాన్ని చూపడం వల్ల బ్రహ్మాన్ని నిమిత్తకారణంగా మాత్రమే చూపసాధ్యం. ఘటానికి కారణమైన కులాలుడు ఎలాచూసినా బ్రహ్మానికి దృష్టాంతం కాలేడు. కులాలుడు అల్పజ్ఞాని, అల్పశక్తిగలవాడున్నూ. ఘటానికి కులాలుడు ఎలాగో అలాగే జగత్తుకి బ్రహ్మం అంటే బ్రహ్మాన్నిజగత్కారణంగా మాత్రమే ఈఅనుమానం చూపిస్తుందే తప్ప బ్రహ్మాన్ని సర్వజ్ఞుడిగానూ, సర్వశక్తిమంతుడిగానూ చూపదు. అనుమానంవల్ల ఇంతమాత్రమే స్పష్టం అవుతుంది. లోకదృష్టాంతాన్ని ఆధారంగా తీసుకున్న అనుమానంవల్ల బ్రహ్మనిగురించిన పూర్ణజ్ఞానాన్ని పొందడం సాధ్యంగాదు. లోకదృష్టాంతంద్వారా సిద్ధించేవాడు ఒకజీవుడుగామాత్రమే ఉండసాధ్యం తప్ప

బ్రహ్మం సిద్ధించడం సాధ్యంగాదు. అంతేగాదు, విపులకార్యాలకి లోకంలో చాలామంది చేరి కర్తలుగా చూడబడుతున్నారు. జగదుత్పత్తి,స్థితి, లయం అన్నీ మహత్తరమైన కార్యాలు. అనుమానాన్ని ప్రమాణంగా తీసుకుంటే, వీటికి కర్తలుగా ఎన్నో బ్రహ్మలు ఉన్నవాళ్ళుగా తేల్తుంది. లోకదృష్టాంతంతో చూసినప్పుడు కర్తృ-ఐక్యాన్ని అనుమానం చూపదు. ఈకారణాలవల్ల ***"అనుమానప్రమాణం దోషయుక్తం; అది బ్రహ్మని చూపడానికి సమర్థంగాదు; శాస్త్రం ఒక్కటే సమర్థమైనది; అందుచేత బ్రహ్మవిచారం ఆరంభింపతగినదే"*** అన్నది స్పష్టం అయింది.

నాలుగోదైన ***సమన్వయాధికరణంలో - శాస్త్రమనేది బ్రహ్మాన్ని పరమ(ఉత్కృష్ట)పురుషార్థంగా చూపుతున్నది*** - అన్న యథార్థం స్థాపించబడుతోంది.

ఈవిధంగా ఈనాలుగు అధికరణాల్లోనూ సారార్థాలని మనం ఒకరకంగా తెలుసుకుంటున్నాం. *"శ్రుతిశిరసివిదీప్తే"* అన్నది ఈఅర్థాలని ఎలా సూచనం చేస్తోందో చూద్దాం. *"శ్రుతిశిరసివిదీప్తే"* అన్నది ***"వేదాంతంవల్ల బ్రహ్మం పరమపురుషార్థం అని చూపబడుతోంది"*** అని మనకి తెలియజెయ్యడంద్వారా బ్రహ్మనిబట్టి వ్యుత్పత్తి వస్తుంది అన్న నిజాన్నికూడా తెలియజేస్తోంది. వ్యుత్పత్తి(తెలివి) వస్తేనే సరిపోదు. లక్షణపూర్వకమైన వ్యుత్పత్తి రావాలి. అప్పుడే బ్రహ్మాన్ని పరమపురుషార్థంగా మనం తెలుసుకోగలం. కనుక, ఇదికూడా "బ్రహ్మం పరమపురుషార్థం" అనడంవల్ల సూచింపబడినదైంది. శ్రుతిశిరస్సులో - వేదాంతంలో - ఆయన ఇలా ప్రకాశిస్తున్నాడు అంటే ప్రమాణాంతరాలవల్ల ఆయన ఇలా తెలియజేయ బడడం లేదు అనే అర్థంకూడా సూచితమౌతోంది. "శ్రుతిశిరస్" శబ్దంవల్ల ప్రమాణాంతరం వ్యావర్తం అవుతోంది. దీనితో శాస్త్రయోనిత్వాధికరణార్థంకూడా సూచింపబడడం అయింది. ఇలా "ఆయన తెలియ బడుతున్నాడు", "లక్షణపూర్వకంగా తెలియబడుతున్నాడు", "శాస్త్రైకసమధిగమ్యుడుగా తెలియబడు తున్నాడు", "పరమపురుషార్థంగా తెలియబుతున్నాడు" అని నాలుగధికరణార్థాలూ "శ్రుతిశిరసి విదీప్తే" అన్నదాంట్లో అంతర్భూతంగా ఉన్నాయి అన్నది స్పష్టం అయింది.

*"బ్రహ్మణి శ్రీనివాసే"* - "బ్రహ్మ" అన్నది సామాన్య శబ్దం. "శ్రీనివాసః" అన్నది విశేష శబ్దం. ఇక్కడ విశేషశబ్దాన్నిమాత్రం ప్రయోగిస్తే సరిపోయిఉండగా దాంతో సామాన్య శబ్దాన్నికూడా చేర్చి ఎంబెరుమానార్లు ప్రయోగించడంలో అభిప్రాయం ఏమిటి అన్నదాన్ని మనం గమనించాలి. ఉపనిషత్తుల్లో ***"సత్", "బ్రహ్మ", "ఆత్మా"*** అని సామాన్య శబ్దాలు అనేకస్థలాల్లో కనబడుతాయి. ***"నారాయణః"*** అన్న విశేషవాచక శబ్దం గల ***"ఏకో హ వై నారాయణ ఆసీత్..."*** వంటి వాక్యాలూ కనబడుతాయి. ఈసామాన్యపదాలూ, నారాయణ అనే విశేషశబ్దంవల్ల చెప్పబడుతున్నవాడినే సూచిస్తున్నాయని చూపించడంకోసం ఎంబెరుమానార్లు కూడా సామాన్యపదాన్ని విశేషవాచకశబ్దంతో చేర్చి చూపిస్తున్నారు. ***"శ్రీనివాసే"*** అని మాత్రం చెప్పి ఊరుకోకుండా ***"బ్రహ్మణి శ్రీనివాసే"*** అని వారు సాయించడానికి ఇదే అభిప్రాయంగా చూపబడుతోంది.

శ్రీనివాసశబ్దంతాలూకు అన్వయశక్తి *"శ్రియః నివాసః శ్రీనివాసః"* (అంటే లక్ష్మీదేవికి వాసస్థానమై ఉన్నవాడు) అనడంవల్ల నిత్యవిభూతినాథుడు అనే అర్థాన్ని చూపుతోంది. శ్రీనివాస శబ్దానికున్న రూఢి (సముదాయ)శక్తివల్ల మతాంతరస్థుల నాలుగుపక్షాలు నిరాకరింపబడుతున్నాయి. "త్రిమూర్తిసామ్యం", "త్రిమూర్తి ఐక్యం", "బ్రహ్మం త్రిమూర్తులకంటే మీదిదైన తత్త్వం", "ఈశ్వరుడే బ్రహ్మం, ఆయన

త్రిమూర్తులకంటే వేరుగా ఉండే సదాశివబ్రహ్మము; త్రిమూర్తులు ఈశ్వరత్వం లేనివాళ్ళు" అనేవి ఈనాలుగు పక్షాలు. శ్రీనివాసశబ్దం రూఢిచేత దేవతావిశేషమైన నారాయణుడినే తెలియజేస్తుంది. *"బ్రహ్మణి శ్రీనివాసే"* - "నారాయణుడనే బ్రహ్మం - నారాయణుడే బ్రహ్మం" అని చెప్పి ఉండడంవల్ల ఈనాలుగు పక్షాలూ నిరసింపబడుతున్నాయి.

*"పరస్మిన్"* అన్నదానికి రెండు వ్యాఖ్యానాలని అనుగ్రహించేరు శ్రుతప్రకాశికాచార్యులవారు. *"పరస్మిన్"* అన్నది ***పరాధికరణార్థసూచకం*** అన్నది మొదటి వ్యాఖ్యానం. *"పరస్మిన్"* అన్నది ***ఉభయలింగాధికరణార్థాన్ని సూచనం*** చేస్తోంది అని రెండో వ్యాఖ్యానం. రెండింటినీ ఇప్పుడు అనుభవంలోకి తీసుకుందాం. మూడో అధ్యాయంలో రెండోపాదం ఏడో అధికరణం పరాధికరణం. ఈఅధికరణంలో జగత్కారణవస్తువే పరబ్రహ్మం అని చూపించబడింది. "జగత్కారణవస్తువు ఉపాయం అనడంవల్లనూ, ఉపాయం కంటే ఉపేయం ఉన్నతమైనది అనడంవల్లనూ ఉపేయంగా ఉపాయం ఉండసాధ్యంగాదు; ఉపేయంగా మరొక వస్తువు ఉండాలి" అన్నది ఈఅధికరణంలో పూర్వపక్షం. *"ఉపపత్తేశ్చ"* (3-2-34) అనే సూత్రంలో *"ప్రాప్యమైన బ్రహ్మనికే ప్రాపకత్వంకూడా తగిఉండడంవల్ల జగత్కారణవస్తువైన ఉపాయమైన బ్రహ్మమే ప్రాప్యం"* అని నిశ్చయించేరు శ్రీవేదవ్యాసులవారు. కనుక జగత్కారణవస్తువుకంటే అతిరిక్తమైన తత్త్వం పరబ్రహ్మం కాదు. జగత్కారణవస్తువే పరబ్రహ్మం అన్నది తెలుసుకోవలసినది.

*"బ్రహ్మవిదాప్నోతి పరమ్"* అని ఉపనిషద్వాక్యం. "బ్రహ్మోపాసకుడు ఫలాన్ని పొందుతాడు; ఉత్కృష్టమైన తత్త్వాన్ని పొందుతాడు." అనే అర్థాన్నిఈఉపనిషద్వాక్యం తెలియజెయ్యడంవల్ల ఉత్కృష్టతత్త్వమే ప్రాప్యం అన్నదాన్ని ఈవేదాంతవాక్యం మనకి చూపిస్తోంది అన్నది స్పష్టం. "ఉపేయం ఒకటి వేరుగా ఉండదు; ఉపాయమైన జగత్కారణవస్తువే ఉపేయమైన భగవానుడు" అని ఉపేయాంతరవ్యావృత్తి సిద్ధిస్తోంది. పరమాత్మ మనకి ఉపాయమైకూడా ఉన్నాడు; ఉపేయమైకూడా ఉన్నాడు. ఆయనని పొందడానికి ఆయనే మార్గంగాకూడా ఉన్నాడు. ఆయనవల్లనే ఆయననే మనం పొందుతాం. ఆయనవల్లనే ఇతరవస్తువుని పొందడం అన్నది లేదు. మరొకదానివల్ల ఆయనని పొందడం అన్నది లేదు. *"ప్రాప్య ప్రాపక ఐక్యం"* అనే ఈఅర్థాన్నే ఇక్కడున్న *"పరస్మిన్"* అనే శబ్దం మనకి చూపిస్తోంది. ***"జగత్కారణవస్తువే శ్రీనివాసుడు"***అన్నది వెనక చూపించబడింది. *"పరస్మిన్ బ్రహ్మణి శ్రీనివాసే"* అనడంవల్ల ***"జగత్కారణవస్తువైన పరబ్రహ్మమే ఉపాయంగానూ, ఉపేయంగానూ ఉన్నది"*** అన్న అర్థాన్ని ఇది సూచిస్తోంది అన్నది మొదటి వ్యాఖ్యానం.

*"పరస్మిన్"* అన్న శబ్దంతో ఉభయలింగాధికరణార్థం సూచింపబడుతోంది" అన్నది రెండో వ్యాఖ్యానం. "భగవానుడు అంతర్యామిగా ఉండి కార్యవర్గాన్ని రక్షిస్తున్నాడు" అన్న అర్థం వెనక చూపబడింది. "భగవానుడు జగత్తుకి ఉపాదానకారణంగాకూడా ఉన్నాడు అన్నదికూడా వేదాంతంలో స్పష్టం" అన్నది వెనక చూపించబడింది. ***"భగవానుడు ఏస్థానంలో ఉన్నా స్థానప్రయుక్తమైన దోషాలు లేనివాడు; కారణత్వ ప్రయుక్తంగా కార్యంలో ఉండే ఏదోషమూ బ్రహ్మనికి రాదు"*** అనే అర్థం *"సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ"* *"నిష్కలం, నిష్క్రియం శాన్తం బ్రహ్మ"*, *"నిరవద్యం నిరఞ్జనమ్"*, *"అపహతపాప్మా విజరో విమృత్యుః విశోకో*

*విజిఘత్సః అపిపాసః సత్యకామః సత్యసంకల్పః"* వంటి శోధకవాక్యాలవల్ల సిద్ధిస్తోంది. ఈఅర్థమే ఉభయలింగాధికరణం మనకి తెలియజేస్తోంది. ఉభయలింగతయా భగవానుడికి ఉన్న వైలక్షణ్యాన్ని మనకి చూపించేదే ఉభయలింగాధికరణం. *"అఖిలహేయప్రత్యనీకత్వం"* (సమస్తదోషాలకీ ఎదిరైనవాడై ఉండడం) *"కల్యాణగుణైకతానత్వం"* (సమస్తమైన కల్యాణగుణాలతోటీ కలిసి ఉండడం) అన్నవే ఈఉభయలింగాలు (రెండు చిహ్నాలు).

*"పరస్మిన్"* అన్న శబ్దం పరత్వం(మీదుగా ఉండడం) గలవాడు అనే అర్థాన్ని చూపిస్తుంది. మీదివాడు అంటే వైలక్షణ్యయుక్తుడు అని అర్థం. ఉభయలింగత్వంచేత ఈయనకి ఈవైలక్షణ్యం సిద్ధిస్తోంది. లోకంలో కారణంగా ఉండే వస్తువుల్లో ఏదీకూడా ఉభయలింగవిశిష్టమై లేదు. కాని భగవానుడు ఉపాదానకారణమై ఉంటూనే ఉభయలింగవిశిష్టుడిగాకూడా ఉన్నాడు. ఈకారణంవల్లనే ఈయన విలక్షణుడిగా ఉన్నాడు. ఇలా ఈయనకి ఉండే వైలక్షణ్యం "పరస్మిన్" అనే శబ్దంవల్ల సూచనం చెయ్యబడుతోంది.

శ్రీభాష్యమంగళశ్లోకం శాస్త్రార్థసంక్షేపాన్ని చూపిస్తోంది అనే యథార్థాన్ని ఎన్నో విధాలుగా అనుభవిస్తూ వచ్చేం. శాస్త్రాల్లో ఉపాయోపేయాలు చూపబడ్డాయి. వాటిలో ఉపాయాన్ని *"వినత"* - నమస్కరించిన - అనే శబ్దం చూపిస్తోంది. దీన్ని వివరించేటట్లుగా ఉన్నదే నాలుగో పాదంలో ఉన్న *"శేముషీ"* అనే శబ్దం. "శేముషీ" అంటే జ్ఞానం అని అర్థం. "వినత" అనే శబ్దాన్నీ, "శేముషీ" అనే శబ్దాన్నీ చేర్చి చూసినప్పుడు జ్ఞానరూపంగా ఉన్నది నమస్కారం అని తెలుస్తుంది. ఇక్కడ *"శేముషీ భక్తిరూపా"* అన్నది సామాన్యశబ్దమైన "జ్ఞానం" (శేముషీ) అన్నది విశేషశబ్దమైన "భక్తిరూపా" అన్నదాంతో చేర్చి ప్రయోగించబడింది. "శేముషీ భక్తిరూపా" అన్నది భక్తిరూపాపన్న(భక్తిరూపమైన)జ్ఞానాన్ని సూచిస్తోంది. "భక్తిరూపమైన జ్ఞానం" అన్నదానివల్లనే భక్తి అనేది విశేషశబ్దం అనిన్నీ తెలుస్తోంది. సామాన్యవిశేష న్యాయంతో "భక్తిరూపమైన జ్ఞానమే ఉపాయము" అని ఇక్కడ తాత్పర్యార్థాన్ని తీసుకోవాలి. దీనివల్ల "కర్మం, జ్ఞానం చేరి ఉపాయం" అనే భాస్కరమతం, "వాక్యజన్య వాక్యార్థజ్ఞానమే ఉపాయం" అనే శాంకరాద్వైత మతమూ నిరసింపబడుతున్నాయి. ""శేముషీ భక్తిరూపా" - భక్తిరూపాపన్న జ్ఞానం అనేది శాస్త్రాల్లో విధింపబడినదే అవుతుంది. *"శుద్ధభావం గతో భక్త్యా శాస్త్రాత్ వేద్మి జనార్దనం"* అన్న మహాభారతశ్లోకం ***"భక్తివల్ల శుద్ధమైన చిత్తవృత్తిని పొందినవాడినైన నేను జనార్దనుడిని తెలుసుకున్నాను"*** అని భక్తిని జ్ఞానప్రాప్తికి కారణంగా చెప్తోంది. *"భక్త్యాతు అనన్యయా శక్యః"* (వేరొకప్రయోజనాన్ని కోరకుండా నన్నే పొందాలనుకునేవాళ్ళు చేసే భక్తివల్లనే నేను పొందతగినవాడిగా ఉన్నాను) అని భగవానుడు గీతలో సాయించిఉన్నాడు. *"తత్త్వేన ప్రవేష్టుంచ పరంతప"* (భక్తి ఒక్కదానిచేతనే యథాతథంగా తెలుసుకొనడానికి సాధ్యం, చూడసాధ్యం, పొందసాధ్యం) అని భగవద్వచనంకూడా ***"భక్తే జ్ఞానదర్శనప్రాప్తులకి సాధనంగా ఉన్నది"*** అని పరమార్థాన్ని మనకి తెలియజేస్తోంది. ఈఅర్థమే ఇక్కడకూడా *"శేముషీ భక్తిరూపా"* అనడంవల్ల వివక్షితమైంది.

*"అహమస్మి అపరాధానాం ఆలయః"* అన్నదానిలా ఇక్కడ ఎంబెరుమానార్లుకూడా ఇక్కడ చెప్తున్నారన్నది *"మమ"* శబ్దంవల్ల సూచితం. పైత్యం తగ్గినవాడికి మాత్రమే పాలు రుచిస్తాయి. అలాగే భక్తికి విరోధియైన పాపాలు నశించిపోయినవాడికి మాత్రమే భక్తిఅనేది ప్రీతిగా ఉంటుంది. *"మమ భవతు"* - భక్తి

కలగడానికి ఆటంకాలుగా ఉన్న తనపాపాలని పోగొట్టి తనకి భక్తిరూపాపన్న జ్ఞానాన్ని అనుగ్రహించవలెనని భగవానుడిని ఎంబెరుమానార్లు ప్రార్థిస్తున్నారు అని ఒక వ్యాఖ్యానం.

అందరికీ భక్తిఅనేది మధురంగా ఉండదు. వీరివంటి జ్ఞానులకే భక్తి చాలా మధురంగా ఉన్నది. దాన్ని భగవానుడిదగ్గరనుంచి ప్రార్థించే పొందాలి అన్నది *"భవతు"* అనడంవల్లచూపబడుతోంది. దానివల్ల ఇతరులని వ్యావర్తించి, *"నాకు భక్తిరూపాపన్నజ్ఞానం కలుగుగాక"* అని భగవానుడిని ప్రార్థిస్తున్నారు అని రెండో వ్యాఖ్యానం.

*"శేముషీ భక్తిరూపా"* అన్నప్పుడు మనం ఉన్మస్తకమై అనుభవించవలసిన అర్థవిశేషాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో మన సిద్ధాంతసంప్రదాయంతాలూకు పరమార్థం ఒక్కటే ఎంబెరుమానారు (లఘుసిద్ధాంతంలో) మనకి చూపించినప్రకారం అనుసరించి యథామతి విన్నపిస్తున్నాను. *"జీవపర యాథాత్మ్యపూర్వక"* అని స్వామి ఎంబెరుమానారులు వేదార్థసంగ్రహప్రారంభంలో సాయించేరు. జీవాత్మనిగురించిన్నీ, పరమాత్మనిగురించీ, ఇద్దరికీ ఉన్న సంబంధంగురించిన్నీ మొదట తెలుసుకోవాలి. అకారవాచ్యుడైన సర్వేశ్వరుడికి అనన్యార్హశేషభూతుడీ జీవాత్మ. (మకారవాచ్యుడైన) జీవాత్మకి నిరుపాధికశేషిగా ఉన్నవాడు పరమాత్మ. ఈయనని చెప్పకుండా వాడిని చెప్పడం సాధ్యంగాదు. వాడిని చెప్పకుండా ఈయనని చెప్పసాధ్యంగాదు. ఈఇద్దరూ ఒకరినొకరు విడవలేని సంబంధం ఉన్నవాళ్ళు.

*"అమ్మైనరజ్గర్క్కుమ్ ఆవిక్కుమ్ అన్తరజ్గ సమ్బన్దమ్"* అంటారు సప్తగాథలో విళాఞ్జోలై పిళ్ళై. మనకి ఈజ్ఞానం మొదటలో రావాలి. దానితర్వాత పరమాత్మనిగురించిన చింతనం కుదరాలి. పరమాత్మచింతనంవల్లనే మోక్షం. వాక్యార్థజ్ఞానంవల్లగాదు. శారీరకశాస్త్రం నాలుగో అధ్యాయం మొదటిపాదం ఆవృత్తిపాదం అనబడుతుంది. ఇందులో పదకొండు అధికరణాలు. వీటిలో బ్రహ్మవిద్యావిచారానికని ఆరు అధికరణాలు. ఈశరీరం ఉండడంతోటే బ్రహ్మవిద్యాదులు వస్తున్నాయి. పరమాత్మని గురించిన అనుభవం లభిస్తోంది. *"తస్మిన్ దృష్టే పరావరే"* అన్నప్రకారం దర్శనసమానకారమైన ఒకజ్ఞానం. *"ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః"* అని శ్రవణాన్నీ, మననాన్నీ, అనువాదం చేస్తోందీ వేదవాక్యం. వీటిని విధించలేదు. ధ్యానానికిమాత్రమే విధి అని శ్రీభాష్యసారం. పరమాత్మనిగురించిన చింతనాన్నే చేసినప్పుడు ఆచింతనం ముదిరందంటే కలిగేది ప్రత్యక్షసమానాకారం. పరమపదంలో ఏఅనుభవం లభిస్తుందో దానికి సమానమైన అనుభవం ఇక్కడ లభిస్తుంది. పరమపదంలోనూ ఇదే అనుభవం. కాని రెండింటికీ వ్యత్యాసం ఏమిటంటే, పరమపదం నిత్యమండలంగా ఉండడంవల్ల అక్కడ లభించే అనుభవం నిత్యానుభవం. ఈలోకం అనిత్యమండలంగా ఉండంవల్ల ఇక్కడ లభించే అనుభవం అనిత్యానుభవం.

ఇలా ఆయనని యథాతథంగా తెలుసుకొని (మనగురించికూడా అలా యథాతథంగా తెలుసుకొని) ఆయన శ్రీపాదపద్మాలని ధ్యానం చెయ్యాలి. ఈధ్యానం అనేది అసకృదావృత్తజ్ఞానం. ఇది వాక్యార్థజ్ఞానంగాదు. *"జ్ఞానమాత్రస్య హేతుత్వ శ్రుతేః"* - వేదాంతజ్ఞానంమాత్రమే ఉపాయము అని చెప్పిందే అంటే, " అదే నేనూ చెప్తున్నాను" అంటున్నారు ఎంబెరుమానార్లు. *"తమేవం విద్వాన్ అమృత*

*ఇహ భవతి నాన్యః పన్థా అయనాయ విద్యతే*" అని పురుషసూక్తం చెప్తోంది. సర్వేశ్వరుడు గీతలో ఇలా సాయించేడు - "*భక్త్యా తు అనన్యయా శక్యః*" జ్ఞానంచేతనే మోక్షం అని వేదాంతం చెప్తూంటే భక్తివల్ల మోక్షం అని గీతాచార్యుడు చెప్తున్నాడు. మన సంప్రదాయంలో భక్తి వేరు, జ్ఞానం వేరు అని అంగీకరించలేదు. జ్ఞానమనేది భక్తిరూపాపన్న జ్ఞానం. ఇలా ఇటువంటి జ్ఞానాన్నే "*శేముషీ భక్తిరూపా*" అని భగవంతుడినుండి ప్రార్థిస్తున్నారు. అదే "*మయర్వఱ మదినలమ్ అరుళినన్*" అని పాశురం పాడేరు నమ్మాళ్వారు. ***నలం అంటే భక్తి. మది అంటే జ్ఞానం.*** మన ఆచార్యులందరూ భక్తినే సర్వేశ్వరుడినుంచి ప్రార్థించేరు. మన సిద్ధాంతంప్రకారం ఈభక్తి అనేది సాధనపరంగాదు. ఈభక్తి సాధ్యపరం అంటే పరమాత్మఅనుగ్రహంవల్లనే లభించేదిగా ఉన్నదే భక్తి. ఇదే ఫలం. ఇదే పురుషార్థం. కనుకనే ఈభక్తిని గురించి విచారించేరు వేదవ్యాసులవారు నాలుగో అధ్యాయమైన ఫలాధ్యాయంలో.

"*రక్షైకదీక్షే*" అనడంవల్ల చేతనులని రక్షించడమే వ్రతంగా గలవాడైన భగవానుడి ఉపాయభావం తెలియజేయబడుతోంది. "*పరస్మిన్*" అనడంవల్ల భగవానుడి ఉపేయభావం తెలియజేయబడుతోంది. "*భక్తిరూపా*" అన్నది సిద్ధోపాయమైన భగవానుడిని వశీకరణం చేసుకుందికి కారమమైన (సాధ్యోపాయమైన) భక్తిని చూపిస్తోంది. ఇవన్నీ శాస్త్రంలో చెప్పబడిన పరమసారభూతమైన అర్థవిశేషాలు. వీటిని ఈశ్లోకంలో శాబ్దంగా చూపించి కటాక్షించేరు ఎంబెరుమానారు.

ఈశ్లోకంలో వీరు చూపించిన అర్థాల్లో ఏకదేశం పరపక్షనిరాసనం. పరపక్షనిరాసనం అన్నది ఈశ్లోకంలో ఎంబెరుమానార్లు శాబ్దంగా స్వపక్షాన్ని చూపించే పదాల అర్థబలంతో ఎలా సిద్ధిస్తోందో ఇప్పుడు చూద్దాం. "*జన్మ స్థేమభఙ్గాది*" శబ్దాలవల్ల ఒకే సమయంలో సృష్ట్యాదులని అంగీకరించని భాస్కర, ప్రాభాకరమతాలు నిరసించబడ్డాయి. "***ఒకే సమయంలో సృష్టి పూర్తిగా (మొత్తంగా) జరుగుతోంది, స్థితికాలంలో భగవానుడి రక్షణంకూడా ఇలాగే జరుగుతోంది, లయకాలంలోకూడా ఒకే సమయంలో మొత్తంగా భంగం అవుతోంది***" అన్నది వేదాంతం చూపే అర్థం. దీన్ని వీళ్ళు అంగీకరించలేదు. పరమవేదాంతసారభూతమైన ఈఅర్థాన్ని చూపడంద్వారా వీరిమతాలు నిరసింపబడుతున్నాయి అన్నది అర్థాత్ సిద్ధిస్తోంది. "జగత్తుతాలూకు ఉత్పత్తిస్థితిలయాలకన్నింటికీ భగవానుడు సాక్షిగా మాత్రం ఉన్నాడు" అని చెప్పే ***హిరణ్యగర్భమతం*** "*లీలా*" శబ్దప్రయోగంవల్ల అర్థాత్ నిరసింపబడుతోంది. "*వినత*", "*వివిధ*" శబ్దాలు "***జీవులు అనేకములు***" "***వాళ్ళలోవాళ్ళకి పరస్పరం భేదం ఉన్నది***" ***అనిజీవపరభేదాన్ని చూపడంవల్ల అద్వైతమతం నిరాకరింపబడుతోంది.*** "*శ్రుతిశిరసి విదీప్తే*" అనడంవల్ల వేదాన్ని ప్రమాణంగా అంగీకరించకుండా స్వబుద్ధిచేత కల్పితమైన ***చార్వాక, బౌద్ధ, జైనమతాలు నిరసింపబడ్డాయి.*** "*బ్రహ్మణి*"శబ్దం అబ్రహ్మాత్మకమైన ప్రధానాన్ని (ప్రకృతిని) కారణంగా చెప్పే ***సాంఖ్యులని, పరమాణువాదులైన (పరమాణువులు కారణం అని చెప్పే) వైశేషికులనీ నిరసించడం జరిగింది.*** "*శ్రీనివాస శబ్దేన పాశుపతాది వ్యుదాసః*" అంటారు శ్రుతప్రకాశికాచార్యులవారు. "*శ్రీనివాస*"***శబ్దంవల్ల అవరతత్త్వమైన పశుపతిని పరతత్త్వంగా తీసుకునే పాశుపతమతం నిరసింపబడింది.*** "*శేముషీ*" ***అనడంవల్ల జ్ఞానకర్మసముచ్చయానికి ఉపాయత్వం చెప్పేవాళ్ళూ, "వాక్యజన్యవాక్యార్థమే మోక్షోపాయం" అని చెప్పేవాళ్ళుకూడా నిరసింపబడ్డారు.***

ఈవిధంగా పరమకకారుణికులైన ఎంబెరుమానార్లు శ్రీభాష్యమంగళశ్లోకంలో చూపించిన అర్థాల్లో కొన్నింటిని ఒకవిధంగా అనుభవించే భాగ్యం పొందినవాళ్ళం అయినాం. ఇలాగే శ్రీభాష్యంలో ఎంబెరుమానారులు చూపించిన పరమవేదాన్తసారభూతమైన అర్థవిశేషాలు అన్నింటినీ బాగా అనుభవించి ఎంబెరుమానార్ల శ్రీపాదసంబంధంతో పొందేఫలం సిద్దించి దానినిపొందినవారవాలని దివ్యదంపతులను ఆళ్వారుల, ఆచార్యుల తిరువడితామరలని ప్రార్థిస్తూ పెద్దలఆజ్ఞతో ముగిస్తున్నాను.